# సంపాదకీయం



రోజులు మారాయి, వారాలు గడిచాయి, నెలలు దొర్లాయి, సంవత్సర కాలం కాలగర్భంలో కలిసిపోయింది. ఎన్నో విజయాలు, ఎన్నెన్నో అపజయాలు చేసిన వాగ్దానాలు నెరవేరని సందర్భాలు, సాధించలేక పోయామనే నిరాశ, నిస్పృహలు, ఆశల హరివిల్లుల మధ్య క్రొత్త సంవత్సరం రానే వచ్చింది.

Goodbye 2017 Welcome 2018 అంటూ తెలుగింటి ఆడపడుచులు రంగురంగుల రంగోళిలతో.... ఉర్రూతలూగే యువతరం డాన్సులు, కేరింతలతో... తల్లి గర్భంలో ఊపిరి పోసుకుని, గర్భాన్ని ఛేదించుకుని నూతన ప్రపంచంలో అడుగుపెట్టాలనే ఆశతో పసికందులు... శాంతి, సామరస్యం వెల్లువిరుస్తాయని సరిహద్దుల్లో సైనికులు కోటి ఆశలతో... క్రొత్త సంవత్సరాన్ని ఆరంభిస్తున్నారు. జయహో 2018.

క్రైస్తవులమైన మన సంగతేంటి? ఎలా క్రొత్త సంవత్సరాన్ని ఆహ్వానిద్దాం? గడచిన కాలానికి కృతజ్ఞత తెలుపుతూ, యేసు నామాన్ని జపిస్తూ, క్రొత్త సంవత్సరాన్ని ఆరంభిస్తే శుభం కలుగుతుందని బైబిలు ప్రభోదిస్తుంది. అలాగే చేద్దామా? అలాగే చేయాలి. ఎందుకంటే యేసే మన రక్షకుడు, ఆయనే మనకు ఆధారం, ఆయనే మనకు జీవం. కాలము, మన భవిష్యత్తు ఆయన ఆధీనంలో ఉన్నాయి. ఆయన నామస్మరణ చేస్తే, ఆయనే మనకు మార్గమై, జీవమై నడిపిస్తాడు.

నూతన సంవత్సరంలో వాగ్దానాలు, నిర్ణయాలు తీసుకోవడం ఆనవాయితి మంచిది. కానీ వాటిని ఆచరణలో పెట్టడం ముఖ్యం. ఏ వాగ్ధానం చేద్దాం? ఏ నిర్ణయం తీసుకుందాం? నూతన సంవత్సరంలో మొదటి రోజు "ప్రపంచ శాంతి దినంగా" స్మరించబడుతుంది. పరిశుద్ధ పోపుగారి ఉద్దేశ్యం ప్రకారం ప్రపంచ

శాంతి కొరకు ప్రార్థన చేద్దాం. అంతేకాదు శాంతిని నెలకొల్పడానికి మన విధానాలను మార్చుకుందాం. ప్రతి ఒక్కరిని ప్రేమతో పలకరిద్దాం! గౌరవిద్దాం.

మమతానురాగాల మాతృమూర్తి మరియతల్లి మానవత్వం పరిమళించిన హృదయంతో దేవునికి విధేయించింది. మానవులను ఆదరించింది. పాపపు ఊబిలో పడిపోయిన ఈ లోకాన్ని రక్షించుటకు దేవునితో సహకరించింది. నూతన సంవత్సరాన్ని ఆరంబిస్తున్న మనందరకు ఆ తల్లే ఆదర్శం. ఆమె అడుగుజాడల్లో నడుద్దాం! దేవుని అనుగ్రహాలు పొందుదాం!

**నూతన సంవత్సర శుభాకాంక్షలతో..**

**ఫా. దామాల విజయ కుమార్**
**ఎడిటర్**

ఒక్కరిని

# మరియమాత మాతృత్వ మహోత్సవం
# 01-01-2018

***సంఖ్యా 6:22-27*** ***గలతీ 4:4-7*** ***లూకా 2:16-21***

తల్లులెప్పుడూ తమ పిల్లలపై ఆశలు వదులుకోరు. పిల్లలెంత చెడ్డవారైనా ఎప్పటికైనా వారిలో మార్పువస్తుందని తల్లులు ఎదురు చూస్తూనే ఉంటారు, ఎప్పటిలా వారిని ప్రేమతో ఆదరిస్తూనే ఉంటారు. అలాగే తల్లులందరి కంటె అనురాగవల్లి మన మరియతల్లి తన పిల్లలమైన మనల్ని ఎన్నడూ చేయి విడువరు. ఎన్నిసార్లు మనమాతల్లి ఆశల్ని వమ్ముచేసి, "తప్పటడుగులు" వేస్తూ చతికిలబడినా, దయతో మన్నించి, తిరిగి పైకి లేవడానికి చేయూతనిస్తారు, వెన్నుతట్టి ప్రోత్సహిస్తారు, ముందుకు నడిపిస్తారు. ఈ ఆశాభావంతోనే మన మీ నూతన సంవత్సరంలో ప్రవేశించాలి. తండ్రి దేవుని సన్నిధానానికి మనం చేసే జీవన ప్రయాణాన్ని ఆ తల్లి ప్రార్థనా సహాయంతోనే కొనసాగించాలి. మరియమాత సహవాసంలో సాగే మన లౌకిక జీవనయాత్ర అన్నివిధాల అర్థవంతమూ ఫలప్రదమూ అవుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

## మొదటి పఠనం: సంఖ్యా 6:22-27

సంఖ్యా కాండంలోని తొలి అధ్యాయాల కథనం ప్రకారం ఇస్రాయేలు ప్రజలు వాగ్దత్త భూమికి తరలివెళ్ళేందుకు సన్నద్ధులవుతూ ఉంటారు. అప్పటికే రెండేళ్ళుగా వారు సీనాయి పర్వత ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈ రెండేళ్ళ కాలంలోనే దేవుడు ఇస్రాయేలీయులను తన ప్రజలుగా మలుచుకున్నారు, దానితో ఇస్రాయేలీ జాతి దేవుడు తీర్చిదిద్దిన 'ఆధ్యాత్మిక సేన'గా రూపుదిద్దుకుంది. అయితే ఈ సేన ఆయుధ సంపత్తి మీద ఆధారపడే సేనావాహిని కాదు, దేవుని మహాశక్తి సంపన్నత మీదనే ఆధారపడే భక్తజనవాహిని. దేవుని ఆజ్ఞలను పాటిస్తూ ఆయనతో సత్సంబంధాలు కలిగి ఉన్నంతవరకే ఇస్రాయేలీ జాతి దేవుని దివ్యశక్తిని పొందుతూ ఉండేది, దేవునికి దూరమైనపుడు నిర్వీర్యమై పరాజయం పాలయ్యేది.

నిజానికి వాగ్దత్త భూమికి పయనమయ్యే దశలో ఇస్రాయేలీయులకు దేవుడితో గల సంబంధాలు పటిష్టంగానే ఉండేవి. అందుకొక ఉదాహరణ యాజకుల నోట దేవుడు పలికించిన ఆశీర్వచనాలు :

"యావే మిమ్ము దీవించి కాపాడును గాక!
యావే తన ముఖకాంతిని మీపై ప్రకాశింప జేసి
మిమ్ము కరుణించును గాక!

యావే మిమ్ము కృపతో జూచి, మీకు సమాధానమును ఒసగును గాక! (సంఖ్యా 6:24-26).

ఈ ఆశీర్వచనాలను పరిశీలిస్తే- దేవుడికి ఆయన ఎన్నుకున్న ప్రజలకు ఎంతటి గాఢానుబంధం ఉండేదో బోధపడుతుంది. ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆరోను కుమారులైన ఎలియాసరు, ఈతామారు ఇస్రాయేలీ సమాజం తరపున దేవదేవునికి అర్చనలు చేసే యాజకులుగా నియమితులయ్యారు. ఇస్రాయేలీ ప్రజలు ఒక్కుమ్మడిగా వాగ్దత్త భూమివైపు తొలి అడుగువేశారు. కానీ దేవుడి పట్ల ప్రగాఢ విశ్వాసంతో కదలి వెళ్ళిన ఇస్రాయేలీయులు ఎడారిలో ఏళ్ళ తరబడి సాగిన ప్రయాణంలో అప్పుడప్పుడు దేవుడిమీదున్న నమ్మకాన్ని కోల్పోతూ ఉండేవారు. ఫలితంగా దేవుని ఆగ్రహానికి గురై శిక్ష ననుభవిస్తూ ఉండేవారు. అయితే పశ్చాత్తాపంతో వారు మరలివచ్చిన ప్రతిసారి దేవుడు తిరిగి వారికి శాంతీ సౌభాగ్యాలను ప్రసాదించేవారు.

ఏది ఏమైనా ఈ నూతన సంవత్సరాది నాడు యావే దేవుని చల్లని ఆశీర్వచనాలను భక్తితో స్మరించుకోగలుగుతున్నందుకు సంతోషించాలి. ఈ శుభ సందర్భంలోనే తల్లి శ్రీసభ మనకు తన అమూల్యమైన ఆశీర్వచనాలను కూడా అందజేస్తోంది.

ప్రభు నామాన్ని స్మరిస్తూ నూతన సంవత్సరంలో అడుగిడబోతున్న మనకు ఈ ఆశీర్వచనాలు మంగళ ప్రదమవుతాయి, మన హృదయాలను మన జీవితాలను కొంగొత్త ఆశలతో పల్లవింపజేస్తాయి. ఇందులో సందేహం లేదు. అయితే క్రైస్తవులమైన మనం క్రీస్తు ప్రభువు ద్వారా దేవుడు మనతో ఏర్పరుచుకున్న ఆత్మీయ బంధం పట్టుసడలిపోకుండా కాపాడుకోవాలి. అప్పుడే మనం దేవుని దివ్యశక్తి ప్రభావాన్ని సంవత్సరం పొడవునా అనుదినమూ అనుక్షణమూ చవిచూడగలుగుతాం.

## రెండవ పఠనం: గలతీ 4:4-7

పునీత పౌలు గలతీయులకు రాసిన లేఖలోని ప్రధాన సందేశం విమోచనం. క్రీస్తు ప్రభువు మనలను విమోచించాడు. మనం తండ్రి దేవుని ప్రేమించడానికీ ఆయనతో సాన్నిహిత్యం పెంచుకోడానికీ అవరోధాలుగా ఉన్న బంధనాలన్నింటి నుంచీ ప్రభువు మనల్ని విముక్తుల్ని చేశాడు. అంతేకాదు ప్రభుక్రీస్తు సహాయంతో, అంటే పవిత్రాత్మ దివ్యశక్తితో క్రైస్తవులమైన మనం జీవితంలో మనకు తారసపడే ఎలాంటి పరిస్థితులనైనా సమతాభావంతో ఎదుర్కోగలుగుతాం, లౌకికమైన ఏ శక్తులకూ ఎలాంటి ప్రలోభాలకూ బానిసలం కాకుండా అచ్చమైన ఆంతరంగిక స్వేచ్ఛతో బతకగలుగుతాం. ధర్మచట్టాల తాలూకు ప్రతిబంధకాలు

గానీ, పాపం గానీ, మరణం గానీ క్రైస్తవుల ఆత్మగౌరవాన్నీ ఆంతరంగిక స్వేచ్ఛనూ హరించలేవు, నాశనం చేయజాలవు, దైవకుమారుడు క్రీస్తుప్రభువు తన మనుష్యావతారం ద్వారా, జననం ద్వారా, అంటే- తన "మొదటి రాక" ద్వారా పాత ధర్మచట్టాన్ని పరిపూర్ణం కావించడమే కాక దానిని తానే రద్దు చేశాడు; అలాగే అప్పటివరకు మానవజాతి పైనా చరాచరజగత్ సర్వస్వం పైనా పాపమూ మరణమూ చలాయిస్తోన్న అధికారాన్ని సైతం పూర్తిగా తొలగించాడు, సంపూర్ణ స్వేచ్ఛను ప్రసాదించాడు.

ఇలా దైవ కుమారుడైన క్రీస్తు ప్రభువు మానవుడుగా జన్మించి మానవులను ఉద్ధరించాడన్న సత్యాన్ని ప్రకటించే సందర్భంలో ప్రభువుకు జన్మనిచ్చిన స్త్రీమూర్తి గురించి సహజంగానే ప్రస్తావించవలసి వస్తుంది.

"ఆయన ఒక స్త్రీ నుండి పుట్టెను" (4:4)

ఇక్కడ యేసు ప్రభువుకు జన్మనిచ్చిన పుణ్యవతి ప్రస్తావన తేవడం సమంజసంగానూ అర్థవంతంగానూ ఉంటుంది. ఎందుకంటే దేవుడు నిర్దేశించిన మానవరక్షా ప్రణాళిక నిర్విఘ్నంగా నెరవేరడంలో ఈ స్త్రీ మూర్తి ప్రధానపాత్ర వహించింది, ఈమె ధన్యగర్భాన జన్మించడం ద్వారానే దైవకుమారుడైన ప్రభువు మానవరూపు దాల్చగలిగారు, క్రైస్తవులకు సకల మానవులకు విముక్తిని ప్రసాదించగలిగారు, నిత్యజీవాన్ని ఆర్జించిపెట్టగలిగారు, ఆ ధన్యకన్య పేరే మరియమ్మ.

లోకరక్షకుడైన యేసుప్రభువుకు జన్మనిచ్చిన తల్లిగా మరియ మాతకు గల గౌరవం ఎనలేనిది, అనితర సాధ్యమైనది. ఆమె కేవలం రక్షకునిమాత మాత్రమే కాదు, యేసు ప్రభువు ద్వారా రక్షణ పొందిన మనకు సైతం ఆమె ప్రియతమ తల్లి, మనమామె కొమార్తెలం, కుమారులం!

## సువార్తా పఠనం: లూకా 2:16-21

ఈనాటి సువార్తా పఠనంలో మనం గొల్లలు బాలయేసును దర్శించిన ఘట్టాన్ని చదువుతున్నాం. సువార్తాకారుడు లూకా చారిత్రకమైన ఈ సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. అంతేకాదు క్రీస్తు శిష్యులకు ఉండవలసిన ప్రధాన లక్షణాలేమిటో కూడా ఈ కథనం ద్వారా సూచించాడు.

క్రీస్తు ప్రభు శిష్యులకు ఉండవలసిన మొదటి లక్షణం: ప్రభువుకు సాక్షులుగా జీవించాలి, ఇతరులకు సత్యప్రబోధం చేయాలి: గొల్లలు మొదట మెస్సయా గురించి దూత

చెప్పిన శుభవార్తను ఆలకించారు, “వెంటనే” దానికి స్పందించారు. తక్షణమే ప్రభువును దర్శించడానికి బయలుదేరారు. మెస్సయా ప్రభువును దర్శించాక అదే శుభవార్తను అందరికీ ఆనందోత్సాహాలతో చాటిచెబుతూ సామాన్యులైన గొల్లలు “తొలి సువార్తా బోధకు” లయ్యారు, దివ్యబాలుడు ఉదయించాడని ఊరూరా చాటిచెప్పారు. ఇదే ప్రభు శిష్యుల ప్రధాన ధర్మం.

ఇలా తన సువార్త ఆరంభంలోనే గొల్లల వృత్తాంతాన్ని చెప్పడం ద్వారా లూకా దేవుడు ఏవిధంగా సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన వారినీ, నిరక్షరాస్యులనూ, అల్పులలో “అత్యల్పులూ అశుద్ధులూ” అయన వారినీ ఎన్నుకొని సువార్తా బోధకులుగా మార్చారో స్పష్టంగా వెల్లడించగలిగాడు. “దేవుడు పేదల పక్షం వాడు, పాపుల పక్షపాతి” అన్న సత్యాన్ని సమర్థవంతంగా నిరూపించగలిగాడు.

ఇదే సత్యం మనకు లూకా 7:36-50 వచనాల్లోనూ, అపోస్తలుల చర్యల్లో గల పవిత్రాత్మ ఆగమన సందర్భంలో జరిగిన సంఘటనల ద్వారా కూడా బోధపడుతుంది. లూకా 7:36-50 వచనాల్లో పశ్చాత్తాపంతో యేసు పాదాలు కడిగి ప్రభు క్షమను పొందిన పాపాత్మురాలు, ఆయన ఆదేశాన్ని శిరసావహించడం ద్వారా దైవరాజ్య ప్రయోక్తగా మారింది, సువార్తా బోధకురాలయింది. అదే విధంగా పెంతెకోస్తు పర్వదినంనాడు దేవుని ఆత్మశక్తిని పొందిన ప్రభుశిష్యులు, అరమాయిక్ భాషతప్ప అన్యభాషలెరుగని గలిలయా వాళ్లు జ్ఞాన సంపన్నులైన వక్తల్లా అనర్గళంగా మాట్లాడి శ్రోతలను ఆశ్చర్యచకితులను చేయగలిగారు.

అలాగే మనం చదివిన సువార్తభాగంలో గొల్లలు అతి సామాన్యులైన శిష్యులకు ప్రతినిధులుగా కనిపిస్తారు; కానీ లోకం దృష్టిలో అయోగ్యులైన వీరే తాము అందుకున్న సువార్తా ప్రభావం ద్వారా సంపూర్ణ పరివర్తనం చెంది, తిరిగి తామే సువార్తా బోధకులై దేవుడు చేసిన మహత్కార్యాలను సాటి మానవులందరికీ బోధిస్తూ చరితార్థులయ్యారు.

రెండవ లక్షణం: విశ్వాసంలోను దైవసంకల్ప అవగాహనలోను ప్రభు శిష్యులు క్రమక్రమంగా పరిణీతిని సాధించాలి: లూకా సువార్తలోను, అపోస్తలుల చర్యల గ్రంథంలోను మరియ మాత ప్రభువుకు ఆదర్శ శిష్యురాలుగా కనిపిస్తారు. గొల్లల మాదిరి మరియమ్మ కూడా శుభవర్తమానాన్ని విన్న వెంటనే సానుకూలంగా స్పందిస్తూ తన సంసిద్ధతను వ్యక్తం చేశారు. యేసు ప్రభువు గురించి తాను విన్న మాటలన్నింటినీ మదిలో పదిలపరచుకుని ధ్యానించేవారు. “తల్లి మరియమ్మ ఆ విషయములన్నియు మనస్సున పదిలపరచుకొని ఉండెను (లూకా 2:51)”. ఆంతరంగిక ధ్యానం విశ్వాస పరిణతికీ, దైవసంకల్ప

సదవగాహనకు దోహదం చేస్తుంది. నిజానికి ప్రభుశిష్యులందరు ఈలాంటి ఆధ్యాత్మిక పరిణతినే సాధించాలి. "యేసు జ్ఞానమందును, ప్రాయమందును" ఏవిధంగా "వర్థిల్లుచు దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను" పొందారో అలాగే ప్రభువుకు శిష్యులు కాగోరేవారు సైతం ప్రార్థనాధ్యానాల ద్వారా విశ్వాస వికాసాన్ని సాధించాలి, దేవుని సంకల్పం పట్ల ఆయనతో తమకు గల అనుబంధం పట్ల సదవగాహన నేర్పరుచుకోవాలి.

ఇలా ప్రభు శిష్యుడు గానీ, ప్రభుశిష్యురాలు గానీ గతంలో దేవుడు తనకు చేసిన ఉపకారాలను అమూల్యమైన కృపావరాలను సదా తన మనసులో నిలుపుకొని మననం చేసుకొంటూ ఉండాలి. అప్పుడు దేవుడిపట్ల తనకు గల నమ్మకం బలపడుతుంది, విశ్వాసం క్రమక్రమంగా పటిష్టమవుతుంది, పరిణతి చెందుతుంది. గతంలో మనకు అండదండగా ఉన్న దేవుడు భవిష్యత్తులోనూ తోడునీడగా నిలుస్తాడు! ఒకవేళ గతంలో దేవుడను గ్రహించిన ఆశీర్వాదాలను అనుగ్రహాలను మరచిపోయినట్లయితే క్రమంగా మన మనస్సులను అనుమాన మేఘాలు కమ్ముకుంటాయి పోను పోను విశ్వాసం సన్నగిల్లిపోతుంది. అలాకాక విశ్వాసంలో అంచెలంచెలుగా అభివృద్ధినీ దేవుని సాన్నిహిత్యాన్నీ సాధించదలచుకునే ప్రభు శిష్యులకు మరియమాతే మహోన్నతమైన మాతృకగా, మార్గదర్శిగా నిలచి చేయూతనందిస్తారు, చేయిపట్టి నడిపిస్తారు!

## ముగింపు:

దేవుని కుమారుడు "మనుష్యకుమారుడు" గా అవతరించడంలో మరియమాత నిర్వహించిన పాత్ర అసాధారణమైనది, అనితర సాధ్యమైనది. తన స్వేచ్ఛను ఇచ్ఛను సంపూర్ణంగా దేవుని పాదాల చెంత ఉంచి, ఆయన పావన సంకల్పాన్ని తలదాల్చుతూ "ప్రభుదాసి"గా మరియాంబ చూపిన అచంచల విశ్వాసం వలన, త్యాగనిరతి వలననే లోకానికి రక్షణోదయమైంది. గనకనే యావత్ మానవజాతికీ మరియమాత కాంతి ప్రదాతగా, ఆదర్శమూర్తిగా, ''మాతృ దేవత'' గా నీరాజనాలందుకోగలుగుతున్నారు, ముక్తిపథగాములందరికీ మరియతల్లి సదా మార్గదర్శిగా వెలుగొందుతూనే ఉంటారు!

# క్రీస్తు సాక్షాత్కార మహోత్సవం
# 07-01-2018

**యెషయా 60:1-6** **ఎఫెసీ 3:2-5,5-6** **మత్తయి 2:1-12**

"సాక్షాత్కారం" అంటే "ఎరుక పరచుట" అని అర్థం. దేవుడు తన ఏకైక కుమారుణ్ణి లోకానికంతటికీ ఎరుకపరచారు. ఆను నిర్దేశించిన లోకరక్షణాప్రణాళికను తన కుమారుని ద్వారా మానవులందరికీ వెల్లడించారు. అంతేకాదు తన కుమారుని ద్వారానే దేవుడు లోకరక్షా ప్రణాళికను అమలు చేయించారు. అలా "యేసు సాక్షాత్కారం" ద్వారా మానవలోకంలో దైవసాక్షాత్కారం జరిగింది; దేవుడికీ మానవాళికీ మధ్య 'తెరచాటు' తొలగిపోయింది. అయితే తండ్రి దేవుడు, దైవకుమారుడు వెల్లడించిన నిగూఢసత్యాలను ఆకళింపు చేసుకొని, 'జ్ఞానోద'యాన్ని పొందడానికి మనం సిద్ధంగా ఉన్నామా లేదా అన్నదే అసలు ప్రశ్న.

అదేవిధంగా దేవుడు ఆవిష్కరించే సత్యవేత కాంతికి స్పందిస్తూ కాంతి బాటలో పయనించే 'జ్ఞానులు" ప్రతి యుగంలోను ప్రతితరంలోను ఉంటూనే ఉన్నారు. అయితే మన యుగంలో మన తరంలో యేసు ప్రభువుతో సహవాసం చేస్తూ, దేవుడు ఆవిష్కరించే సత్యసందేశాలకు స్పందిస్తూ సత్యపథంలో నడవడానికి మనం సిద్ధంగా ఉన్నామా లేదా అన్నదే ఆత్మశోధన చేసుకోవలసిన ప్రశ్న.

## మొదటి పఠనం: యెషయా 60:1-6

యెషయా గ్రంథం మొదటి సగభాగంలో మనకు ఇస్రాయేలీయుల చరిత్రకు సంబంధించిన చీకటి కోణాలే ఎక్కువగా కనిపిస్తాయి. అంటే దేవుణ్ణి ధిక్కరించి ఇస్రాయేలీయులు చేసిన పాపాలు, దేవునికి సేవకప్రాయులుగా మెలగవలసినవారు అందుకు భిన్నంగా అహంకరించి వొడిగట్టిన ఆకృత్యాలు మనకీ భాగంలో అధికంగా కనిపించి బాధిస్తాయి. దేవుడు ఏరికోరి ఎన్నుకున్న ఇస్రాయేలీ ప్రజలు అలా కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించడానికి ప్రధాన కారణం – గర్వం.

అవును, ఇస్రాయేలీయులు అవడానికి దైవప్రజలే అయినా మానవ సహజమైన గర్వాతిశయం వారి తలకెక్కింది. దానితో వారు లోకంలో తామొక్కరే దేవుడు ఎన్నుకున్న ప్రజలనీ, దేవుడు ప్రసాదించే రక్షాభాగ్యానికి తామొక్కరే వారసులనీ, దేవుడికి సంబంధించినదంతా తమకే స్వంతమనీ మిడిసి పడేవారు.

అయితే ప్రవక్తలు రంగప్రవేశం చేయడంతో, ముఖ్యంగా యెషయా ప్రవక్త ప్రజల్లోకి వచ్చి సత్య ప్రకటనం చేయడంతో ఇస్రాయేలీయుల అంచనాలు

తల్లకిందులయ్యాయి, వారి మిడిసిపాటుకు అడ్డుకట్టలు పడ్డాయి. దేవుడు వారిని ఎన్నుకున్నది దేవుడికీ, మిగతా మానవాళికీ మధ్యవర్తులుగా ఉండడానికేనని దేవుడు ప్రసాదించే రక్షాభాగ్యాన్ని వారు లోకంలోని మానవులందరితో పంచుకోవాలనీ, యెషయా ప్రకటించేసరికి ఇస్రాయేలీయుల అతిశయాగ్నుల మీద నీళ్లు జల్లినట్లయింది. నిజానికి లోకంలోని మానవులందరినీ రక్షించి ముక్తిభాగ్యాన్ని ప్రసాదించాలనే బృహత్ ప్రణాళికలో భాగంగానే దేవుడు ఇస్రాయేలీ జాతిని ప్రత్యేకంగా ఎన్నుకున్నారు, వారి ద్వారానే లోకోద్ధరణకు పునాదులు వేయదలచారు. ఇలా దేవుడు యూదయాలోని యెరూషలేము నగరంలో ఇస్రాయేలు ప్రజలకు సాక్షాత్కరించి తనను తాను ఎరుక పరచుకోవడానికి కారణం ఒక్కటే: ఇస్రాయేలు ప్రజల ద్వారా అన్యజనులందరు తనను తెలుసుకోవాలి, తన సన్నిధికి తరలి రావాలి, తాను ప్రసాదించే ముక్తిభాగ్యాన్ని అందుకోవాలి. ఇదే దైవ సంకల్పం. దేవుడు నిర్దేశించిన లోకరక్షా ప్రణాళికలో ఇది అంతర్భాగం.

ఈనాటి మొదటి పఠనంలో మనం చదువుకున్న యెషయా ప్రవచన గీతం మనకు ఇదే సత్యాన్ని వెల్లడిస్తుంది.

"జాతులు నీ వెలుగునొద్దకు వచ్చును
రాజులు కాంతిమంతమైన
నీ అభ్యుదయమును చూడ- వత్తురు" (60:3).

ఎన్నుకోబడిన ఇస్రాయేలుజాతి దేవుని నేతృత్వంలో ఏవిధంగా పరివర్తనం చెంది, అన్యజాతులకు, దేవునికీ మధ్యవర్తిగామారి, ఏవిధంగా లోక-రక్షా సాధనమవుతుందో యెషయా ప్రవక్త స్పష్టంగా దర్శించగలిగాడు. ఆ దర్శనోత్సాహంతోనే ఈ ప్రవచన గీతాన్ని ఆలాపించారు.

"సియోను! లెమ్ము, ప్రకాశింపుము
నీకు వెలుగు ప్రాప్తించినది
ప్రభువు తేజస్సు నీపై వెలుగొందుచున్నది" (60:1)

"సియోను" అంటే యెరూషలేము దేవుడనుగ్రహించే కాంతి పుంజాలను పుణికి పుచ్చుకొని అఖండజ్యోతిలా ప్రకాశిస్తుంది, అంధకారంలో అలమటించే అన్యజాతి జనులను యథార్థమైన జ్ఞానమార్గంలో నడిపిస్తుంది. అంతేకాదు యెరూషలేము నగరం వసుధైక దైవార్చనా కేంద్రంగా వర్ధిల్లుతుంది. లోకంలోని సకల మానవులు సత్యదేవుని నిత్యారాధనకు తరలివస్తారు. వస్తూ వారు బంగారము, సాంబ్రాణి మొదలైన అర్చనా సామాగ్రి తెచ్చి కానుకలుగా సమర్పిస్తారు, వాటితో యెరూషలేము దేవాలయాన్ని హృద్యంగా అలంకరించి ఆలయ ఆధ్యాత్మిక శోభను ఇనుమడింపజేస్తారు, సత్యదేవుని

అర్చనాకాండకు నిండుదనం తెస్తారు. ఇవీ యెషయా పలికిన భవిష్య వచనాలు. ఈ ప్రవచనాలు ఆనాటి ఇస్రాయేలీ ప్రజల మధ్య నెరవేరలేదు. ఈనాడు "నూతన ఇస్రాయేలు" గా వర్ధిల్లుతోన్న శ్రీసభలో అక్షరాలా నెరవేరుతున్నాయి!

## రెండవ పఠనం: ఎఫెసీ 3:2-5,5-6

ఈనాటి రెండవ పఠనంలో పౌలు మనకు రెండు ముఖ్యాంశాలను బోధిస్తున్నాడు: **మొదటిది:** నిగూఢ సత్యం: నిగూఢసత్యమంటే దేవుడు మానవుల రక్షణార్థం సిద్ధం చేసిన రహస్య ప్రణాళిక. ఈ ప్రణాళిక యేసు మానవ లోకానికి రాకపూర్వం ఎన్నో యుగాలపాటు నిగూఢంగానే ఉండిపోయింది. ఈ లోపుగా వెలుగుచూచిన ధర్మచట్టాలు, ప్రవక్తల ప్రబోధాలు మొదలైన పవిత్ర రచనలన్నీ రాబోయే "సత్యావిష్కరణదశ" ను సూచనప్రాయంగా తెలియజెప్పగలిగాయే గానీ దేవుని ప్రణాళికను సంపూర్ణంగా వెల్లడించలేకపోయాయి. ప్రభు మొదటిరాక వరకు ఆ "లోక రక్షా ప్రణాళిక" నిగూఢ సత్యంగాను పరమ రహస్యంగానే మిగిలిపోయింది. అయితే నిగూఢమైన ప్రతి నిత్యమూ దైవ సంకల్పానుసారం క్రమక్రమంగా వెల్లడికాక తప్పదు గనక ప్రభు ఆగమనం వరకు సూచన ప్రాయంగా ఆవిష్కృతమైన సత్యం యేసు అవతరణానంతరం పూర్ణావిష్కరణకు నోచుకుంది. యేసుక్రీస్తు ప్రభువే నేడు మన రక్షణ కోసం విమోచన కోసం దేవుడు సిద్ధం చేసిన రహస్యప్రణాళికను వెల్లడిస్తూ మనకు సత్యపథాన్ని చూపుతున్నారు.
**రెండవది -** దేవుడు సిద్ధం చేసిన రహస్యప్రణాళిక యూదులకు అన్యజనులకు కూడా సమానంగా వర్తిస్తుంది: యేసుప్రభువు ద్వారా ఈ లోకానికి చేరిన దేవుని నిగూఢ ప్రణాళిక, పవిత్రాత్మ ప్రభువు ద్వారా ప్రపంచానికి వెల్లడయింది. అసలీ ప్రణాళికలో ఉన్న సత్యసారాంశ మేమిటీ అంటే మానవమేథ కందని దేవుని అనంతప్రేమ ఈ ప్రణాళికలో దాగి ఉంది. ఆ దేవుని ప్రేమ క్రీస్తుప్రభు పుణ్యజీవనం సిలువ మరణం, పునరుత్థానాల, ద్వారా మానవులకు వ్యక్తమైంది, క్రీస్తు ప్రభువు ద్వారానే యూదులు, అన్యజనులు దేవుని ప్రేమావరణంలోనికి ఆహ్వానించబడ్డారు, దేవుడు ప్రసాదించే రక్షాభాగ్యాన్ని స్వేచగా ఉదారంగా పొందడానికి యోగ్యులయ్యారు.

"…. సువార్తవలన అన్యులకును

యూదులతోపాటు దేవుని దీవెనలలో పాలు లభించును" (3:6) గనక అన్యజనులు సైతం ఇహలోకంలో దేవుడనుగ్రహించే నవజీవాన్ని పొందగలుగుతారు, దైవానుగ్రహ మాధుర్యాన్ని చవిచూడగలుగుతారు, ప్రభుమార్గంలో ముందంజవేస్తూ కడకు పారలౌకిక సిరులన్నింటికీ వారసులు కాగలుగుతారు

ఈ సత్యాన్ని యూదేతర ప్రజలందరికీ ప్రకటించడానికే ప్రభువు ప్రత్యేకంగా పౌలును నియమించారు. ప్రభు ఆదేశానుసారమే పౌలు "అన్యజనుల సువార్తా బోధకుడాయ్యడు, అన్యులకు ముక్తిమార్గాన్ని చూపే "రక్షాదూత" గా గణనీయమైన సేవలందించారు.

## సువార్త పఠనం: మత్తయి 2:1-12

ఈనాటి సువార్తా పఠనంలో ప్రజా రక్షణార్థం జన్మించిన యేసు ప్రభువుకూ, ప్రజా కంటకుడైన హేరోదు రాజుకూ మధ్యగల వ్యత్యాసం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

ఒకపక్క హేరోదురాజు యెరూషలేము నగరం నుంచి తన పాలనాధికారాన్ని చలాయిస్తూ ఉంటాడు. చివరికి ధర్మధిక్కారిగా హేరోదు అప్రతిష్ఠపాలుకాగా, దేవుని రక్షాప్రణాళికను తిరస్కరించిన మానవుల దుర్నీతికి దుష్ఠ సంకేతంగా యెరూషలేము నగరం ఎనలేని అపఖ్యాతిని మూటకట్టుకుంది.

మరోపక్క లోకాలనేలే "యేసురాజు" బెత్లెహేము గ్రామంలో ఓ మారుమూల పసులకొట్టంలో జన్మించారు; అయినా యేసు జననానికి అనువైన ప్రదేశంగా దేవుడు ఎంపిక చేయడం వల్ల బెత్లెహేము గ్రామం జగత్ ప్రసిద్ధమయింది.

అక్కడ చింతాక్రాంతుడైన హేరోదురాజు యెరూషలేము నగరాన్ని చింతలపాలు చేస్తూంటే, ఇక్కడ 'మంచిగొల్ల'గా అవతరించిన యేసు ప్రభువు మాత్రం తన ప్రజలకు మేలిమి వరాలను విశ్రాంతినీ ప్రసాదిస్తున్నారు.

అక్కడ హేరోదురాజు ప్రవక్తల ప్రవచనాలు నెరవేరనీకుండా అడ్డుపడుతూ, బాలయేసును దర్శించ వచ్చిన జ్ఞానులను తన అధికార చదరంగంలో పావులుగా వాడుకోజూస్తే, ఇక్కడ యేసు ప్రవక్తల ప్రవచనాలు అక్షరాలా నెరవేర్చి జ్ఞానుల పూజలందుకున్నారు.

అంతేకాదు యేసుప్రభువు భవిష్యత్తులో ఎదుర్కోబోయే పరిసయ్యులు సద్దూకయ్యులలోని కాపట్యం దాష్టీకమంతా హేరోదురాజులోనే మూర్తీభవించినట్టు కనిపిస్తుంది. దేవుని రక్షాప్రణాళికకు వ్యతిరేకమైన లౌకికాధికారానికీ ఆధిపత్య నాయకత్వానికీ ప్రతినిధిగా హేరేదురాజు నిలిస్తే ఇక్కడ, దేవుని రక్షాభాగ్యాన్ని పదుగురికీ పంచి ఇచ్చే ముక్తి ప్రదాతగా యేసు దర్శనమిస్తారు.

ఈనాటి సువార్త పఠనంలో మరో ముఖ్యాంశం అన్యజీతీయులు మెస్సయా ప్రభువును తన దైవంగా స్వీకరించడం:

ఒక్కపక్క యూదమతనాయకులు, హేరోదురాజు యేసును "మెస్సయా"గా అంగీకరించడానికి నిరాకరిస్తోన్న నేపథ్యంలో, అన్యజాతీయులైన జ్ఞానులు యేసును తన ప్రభువుగా ఆమోదించి ఆరాధించడం ఒక చిత్రమైన వైరుధ్యం. యేసు జనన వార్తను తమకు ఎరుకపరచిన 'దివ్యదర్శనం' వారెన్నడూ ఎరుగనిదీ, నూతనమైనదీ అయినప్పటికీ సంభ్రమాశ్చర్యాలతో స్పందించిన జ్ఞానులు యేసును మెస్సయ్యాగా (యెషయా 60:6) రాజుగా స్వీకరించారు.

అంతేకాదు అన్యజాతీయులైన జ్ఞానులు ప్రభు సాన్నిధ్యానికి తరలిరావడంతో

"జాతులు నీ వెలుగునొద్దకు వచ్చును, రాజులు కాంతిమంతమైన నీ అభ్యుదయమును చూడవత్తురు" అన్న యెషయా ప్రవచనం నెరవేరింది. అలాగే "ఒంటెల సమూహము నీ చెంతకు వచ్చును... అవి షేబానుండి బంగారమును సాంబ్రాణిని గొనివచ్చును". "నృపులు కప్పములు కట్టుదురు" ...పాలకులు కానుకలు కొనివత్తురు" అన్న ప్రవచనాలు సైతం జ్ఞానుల రాకతో నెరవేరడం విశేషం.

నిజానికి ఈ జ్ఞానులు యేసుప్రభువు ద్వారా దేవుడు వెల్లడించిన సత్యవేదానికి సానుకూలంగా స్పందిస్తూ, సత్యకాంతిలో పయనిస్తూ, క్రీస్తే తమ ప్రభువని విశ్వసిస్తూ, ఆయనను త్రికరణశుద్ధిగా అనుసరించేవారకీ, ఆయనను మనసారా పూజించే భక్తజనులందరికీ ప్రతినిదుల్లా నిలుస్తారు.

సాధారణంగా యేసు ప్రభువును తెలుసుకున్నవారు రెండు రకాలుగా స్పందిస్తూ ఉంటారు: యేసును తమ ప్రభువుగా దైవంగా స్వీకరించేవారు కొందరైతే, ఆయనను తిరస్కరించేవారు మరికొందరు. అయితే యేసు ప్రభువును ఆయన సత్యప్రబోధాన్నీ తెలుసుకున్నవారు ఆయనకు సానుకూలంగా స్పందించాలంటే ముందుగా చేయవలసింది ఒక్కటే:

యేసే దైవకుమారుడనీ, రక్షకుడనీ విశ్వసించాలి; విశ్వసించినంత మాత్రాన సరిపోదు; వారి విశ్వాసం పవిత్రమైన పనులు సత్క్రియలు ఆచరించడానికి వారికి దారి చూపాలి. యేసుప్రభువు అనుగ్రహించే శక్తితో పవిత్ర కార్యచరణకు పూనుకోవాలి; అలా విశ్వాసులు త్రికరణశుద్ధిగా ఆచరించే పవిత్ర కార్యాలే "ఆత్మయందును, సత్యమందును" చేసే యదార్థమైన ఆరాధనలవుతాయి. (యోహాను 4:23)

**ముగింపు:**

"నేను దేవుణ్ణి నమ్మను". ఈ మాట అన్నది మరెవరో కాదు, ఒక కతోలిక గురువు. ఈ మాటలు విన్న వ్యక్తి "అదేమిటీ అలా అంటున్నారూ? అని అడిగితే "...అవును ప్రతిరోజు నేనాయన్ని కళ్లారా చూస్తున్నాను, ఆయన మాటలు చెవులారా వింటున్నాను. ఇక ప్రత్యేకంగా ఆయన్ని నమ్మవలసిన పనేమిటి?! అన్నారట ఆ గురువు.

నిజమేగదా! కంటికి కనిపించని దానిని "ఉన్నదని" నమ్మడమో "లేదని" నిరాకరించడమో చేస్తాంగానీ, కళ్లారా చూస్తూ కూడా 'నమ్ముతున్నా" మని ప్రత్యేకంగా చెప్పుకోము గదా! ఆ కతోలిక గురువు "తన దైనందిన జీవితంలో దేవుడు చేస్తున్న సహాయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటూ, తన అంతరంగంలో ఆయన పలికే మాటలను ఆలకించగలుగు"తున్నారు గనకనే "నేను దేవుణ్ణి నమ్ముతున్నానని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదూ" అన్నారు.

అలాగే "ముగ్గురు రాజులు" కూడా ఆకాశంలో నక్షత్రాన్ని కళ్లారా చూచారు, ఆ సంకేతానికి అర్ధమేమిటో గ్రహించారు, ఇక ఎలాంటి అనుమానమూ లేకుండా "లోకరక్షకుడు యేసు ప్రభువు"ను వెదక్కుంటూ బయలుదేరారు, ప్రభువును దర్శించి ధన్యులయ్యారు!

# సామాన్య 2వ ఆదివారం
# 14-01-2018

***1 సమూ 3:3-10,19   1కొరిం. 6:13-15,17-20   యోహాను1:35-42***

## దైవపిలుపు మన ప్రత్యుత్తరం

"దేవుని గృహమైన వసుదైక కుటుంబంలో ఏ పనైనా వంటపని, శపరాసి, అధికారి, నర్సు, ఉపాధ్యాయుడు ఏదైనా సంతోషంతో స్వీకరించాలి. తన కిష్టమైతే దేవుడు తన సలహా సంఘంలో సభ్యున్ని చెయ్యొచ్చు. అయితే ఆ పదవిలో నీవు గొప్పవాడివన్న అనుభూతి చెందొద్దు. ఎందుకంటె దేవుని నుండి పొందే బహుమానం మనం చేసే పనిమీదగాదు, కాని ఆ పినిని నిర్వర్తించిన విశ్వసనీయత మీద ఆధారపడి ఉంది మొదటి జాన్ పౌలు పాపుగారు.

**సంఘటన:** షహనాబాద్ అనే పెద్ద గ్రామంలో దేవేందర్ అనే మోతుబారి రైతు ఉండేవాడు. ఓ రోజున ఆయన తన కొడుకుని పొలం కావలికి పంపిచాడు. ఆ రోజున చాలా పశు పక్ష్యాదులు వచ్చి పంట పొలాన్ని తినడం, తొక్కడం చేస్తున్నాయి. ఆ కొడుకు ఆ పశుపక్ష్యాదులను చూస్తున్నాడు గాని వాటిని తరిమి వేయటం లేదు. ఆ దారిన పోయే కొంతమంది ఆ విషయం గమనించి "పశుపక్షాదులు అలా మీ పొలాన్ని నాశనం చేస్తుంటే నువ్వు చూస్తూ ఊరకుండడం సమంజసమేనా? ఇది చూస్తే నీ నాన్న నీపై కోపపడడా? వాటినెందుకు నువ్వు తరిమివేయడం లేదు?" అని నిలదీసి అడిగారు. అందుకు ఆయన "వాటిని తోలే విషయమై మానాన్న నాకేమి చెప్పలేదు. కాబట్టి ఆ పని నాది కాదు" అన్నాడు. ఈ విషయమంతా తెలుసుకున్న తండ్రి తన కొడుకును ఇంటి నుండి గెంటివేశాడు.

తనసేవకై దేవుని స్వరం, లేదా దేవుని పిలుపు మనకు నేరుగా, ప్రత్యక్షంగా చేరదు. కాని చుట్టుప్రక్కలనున్న ప్రజలు అవసరాలు, పరిసరాల ప్రభావము ద్వారానే చేరుతుంది.

**ఉపోద్ఘాతం:** దైవార్చన కాలండర్ ప్రకారం సాధారణ ఆదివారాలు పోయిన వారం మొదలవ్వాలి. అయితే, ఆ ఆదివారం మనం యేసు బప్తిస్మ ఉత్సవం జరుపుకొన్నాం. కాబట్టి ఆచరణలో సాదారాణ ఆదివారాలు ఈ ఆదివారంతో మొదలవుతున్నాయి. సాధారణ ఆదివారాలు మొదలయిన ఈ రోజున శ్రీసభ మనకు సరియైన, ఉచితమైన ధ్యానాంశాన్ని మన ముందుంచుతుంది. అదే దైవ పిలుపు మన ప్రత్యుత్తరం.

తండ్రి సర్వేశ్వరుని రక్షణాయుతమైన ప్రేమకు, ఆయన జ్యోతికి సాక్షాత్కారమైన ప్రభుయేసు, శిష్యుల ఎంపిక ప్రక్రియను ఆరంభిస్తూ తనతో ప్రత్యేకమైన, అవినాభావ

సంబంధం ఏర్పరుచుకోడానికి ప్రజలను పిలుస్తున్న ఉదంతంతో సాధారణ ఆదివారాలు మొదలవుతున్నాయి. ఈ ప్రక్రియ, దేవుని రక్షణ ప్రణాళికా పరిపూర్తికే మొదలయింది.

'దైవపిలుపు' కేవళం ఏ కొద్ది మందిలో లేదా ప్రత్యేకంగా ఎన్నుకోబడినవారికే సంబంధించింది కాదు. ఈ రోజుల్లో దైవ పిలుపులు తగ్గుతున్నాయి, అసలు దైవ పిలుపులు లేవు అంటుడడం సమంజసం కాదు. అది వాస్తవమూ కాదు. ఎందుకంటే మనలో ప్రతియొక్కరిని ఏదో ఒక బాధ్యతకు, సంఘంలోని ఇతరులకోసం, వారి క్షేమం, రక్షణం కోసం పలిచారు దేవుడు. మనలో ప్రతియొక్కరికి ఏదో ప్రత్యేక వరాన్ని, ప్రతిభను ఇచ్చి దాన్ని పరుల శ్రేయస్సుకోసం సద్వినియోగం చెయ్యమని ప్రభువు ఆదేశిస్తున్నారు. అదే దైవపిలుపు. దాన్ని అమలు చేయడమే మన ప్రత్యుత్తరం.

దేవుని పిలుపు గుర్తించడం: ఈనాటి మొదటి పఠనం బాలుడైన సమూయేలు పిలుపును తెలియజేస్తుంది. బాలుడైన సమూయేలు నిద్రపోయే సమయంలో ప్రభువైన దేవుడు 'సమూయేలు, సమూయేలు అని పలిచారు. అతడు 'చిత్తం అంటూ లేచి ప్రధానార్చకుడైన ఏలి దగ్గరకు వెళ్ళి, మీరు పిలిచారు కదా ఇదిగో, వచ్చాను అన్నాడు. 'నేను నిన్ను పిలువలేదు వెళ్ళి పడుకోమన్నాడు' ఏలి. అలా మూడుసార్లు జరిగింది. అయినా బాలుడైన సమూయేలు అది దేవుని స్వరమని గ్రహించలేకపోయాడు. ఎందుకంటే అతనికి దైవకార్యాలు అనుభవంలోకి ఇంకా రాలేదు. ఆ రోజుల్లో దేవుని స్వరం వినబడటం ప్రజలు గ్రహించడం అరుదు అని ఆ సందర్భంలో చెప్పబడింది.

అయితే దైవ యూడిగంలో తలపండిన ఏలి యాజకుడు, అది దైవస్వరం అని గ్రహించాడు. అందుకే సమూయేలుతో "వెళ్ళి పడుకో ఇక నిన్నెవరైనా పిలిస్తే, ప్రభూ! ఆనతియిమ్ము. నీదాసుడు ఆలకించుచున్నాడు అని చెప్పు అని ఉద్బోధించాడు." అలా సమూయేలు దేవుని పిలుపును గ్రహించడానికి, దానికీ ప్రత్యుత్తర మివ్వడానికి ఏలి దోహదం చేశాడు.

దేవుని పిలుపును ఆలకించి ఆచరిస్తూ సమూయేలు పెరిగి పెద్దవాడయ్యాడు. దేవుని అనుగ్రహానికి పాత్రుడైన సమూయేలుకు ఆయన తోడుగా ఉన్నాడు. 'సమూయేలు పలికిన ప్రతి వాక్యాన్ని ఫలింపజేశారు అంటుంది 3:19వ వచనం. అంటే అప్పటినుండి సమూయేలు దేవుడు చెప్పిన ప్రతిమాటను శ్రద్ధగా ఆలకిస్తూ దాన్ని పాటిస్తూ వచ్చాడు. ఆయన దేవుని చిత్తాన్నే తన మాటల్లో చేతల్లో వెలువరించాడు. కాబట్టి ఆయన ప్రవచనాలన్ని నెరవేరాయి. దేవుని నుండి విన్న దాన్నే సమూయేలు ఇతరులకు చెప్పాడు. అంటే దేవుని ఆలకించి ఆయన చిత్తం గ్రహించినవారు దాన్ని వారిలోనే, వారితోనే అంటిపెట్టుకోక ఇతరులకూ తెలియజేయాలి. ఇతరులకు చెప్పకుండా ఉండటమంటే మత్తయి సువార్త 25:14-30లోని సామెత సేవకుని కర్తవ్యం నిర్వహణ విధానంలో ఉదహరించినట్టు, ఒక లక్ష వరహాలను పొందినవాడు భూమిలో దాచిపెట్టి తనకు,

తన యజమానికి, ఇతరులకు ఉపయోగపడకుండా చెసినట్టవుతుందన్నమాట.

దేవుని స్వరం వినడంలో ఈ క్రింది అంశాలు చోటుచేసుకోవాలి.

దేవుని స్వరాన్ని వినడం

దాన్ని అర్థం చేసుకోవడం

దాన్ని అంగీకరించి, జీర్ణించుకొని సొంతం చేసుకోవడం.

అలా సొంతం చేసుకొన్నదాన్ని వాక్కుద్వారా క్రియారూపంలో ఇతరులతో పంచుకోవాలి. దేవుని స్వరం ఆలకించిన వాళ్ళలో ఈ ప్రక్రియ అంతా జరిగినప్పుడే ఆయన మాట ఫలభరితం అవుతుంది. దేవుడు ఎప్పుడూ పిలుస్తున్నారు. ఆయన స్వరాన్ని మనం వింటున్నామా? ఆయన చెప్పే దాన్ని వినడంలో పై ప్రక్రియనంతా అమలు చేస్తున్నామా?

దేవుని గొఱ్ఱెపిల్ల ఈనాటి సువిశేష పఠనం గూడ పిలుపు గూర్చే ముచ్చటిస్తుంది. ఆ మాటకొస్తే ఇది రెండవ పిలుపు. బప్తిస్త యోహాను శిష్యుల్లో ఇదదరు యేసుకు శిష్యులయ్యే విషయం నేటి సువార్తా పఠనం అంశం. బప్తిస్త యోహాను తన శిస్యులకు యేసును చూపిస్తూ 'ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల' అన్నాడు. తన నాయకత్వం తాత్కాలికమైనదేనని, తన నాయకత్వం యేసుప్రభువునకు అర్పింబడాల్సిందేనన్న విషయం బప్తిస యోహానుకు తెలుసు. అందుకే తన శిష్యులను యేసు శిస్యులుగా చేర ప్రోత్సహించాడు.

'దేవుని గొఱ్ఱెపిల్ల' అన్న బిరుదు సువార్తీకుడైన యోహాను యేసుప్రభునకు ఇచ్చిన అనేక బిరుదుల్లో ఒకటి. ఈ బిరుదు, యేసును యూదుల రక్షణ చరిత్రకు ముడిపెడుతూ మనందరిపై నున్న ప్రేమకు చిహ్నంగా తను బలియయ్యే విషయాన్ని సూచిస్తుంది. బప్తిస్త యోహాను సూచనతో ఆయన శిస్యుల్లో యిద్దరు యేసును వెంబడించారు. అది గమనించి యేసు, "మీకు ఏమి కావలయును" అని అడిగారు. అదే ప్రశ్నను ఈనాడు ప్రభువు నిన్ను నన్ను అడుగుతున్నారు. సాధారణంగా మనం భావించేదేమిటంటే "మన నుండి దేవుడు ఏమి ఆశిస్తున్నారు" అని. మనకేమి కావాలో ఆయనకూడ తెలుసుకోదలచారు. ఈ ప్రశ్న మననుండి వచ్చినా యేసుప్రభు నుండి వచ్చినా, దానికి సమాధానం మాత్రం మనకే ఎక్కువ లాభదాయకం. దేవుడు, ప్రజలు, ప్రపంచం పట్ల మన ప్రాధామ్యాంలేంటో మనం ఏమి ఆశిస్తున్నామో మన సమాధానం తెలియజేస్తుంది.

వాస్తవంగా మన జీవితం కోసం దేవుని నుండి ఏమి ఆశిస్తున్నాం? నిజమే ఈ ప్రశ్నకు జవాబివ్వడం అంత సులభం కాదు. ఏదో ఉబుసుపోకకైతే సమాధానం చెప్పొచ్చు. అంతరాళాల నుండి సమాధానం చెప్పాలంటే మనకు ధైర్యం, తెగింపు, త్యాగం అవసరం.

ఈ ప్రశ్నకు సమాధానం ఒకేసారి చెప్పలేము గూడ. మన జీవిత గమనంలో వివిధ అంతస్తుల్లో, అప్పటి జీవిత పరిస్థితికి తగ్గట్టు సమాధానం ఇవ్వాల్సి యుంటుంది.

**వెళ్ళి పరిశీలించు**: మరి సువిశేష పఠనంలో యేసుప్రశ్నకు శిష్యుల సమాధానమేంటి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి మారుగా, యేసునుండే సమాచారం రాబట్టదలచి, "బోధకుడా నీవు ఎక్కడ నివసించుచున్నావు?" అని ఆ యిద్దరు శిష్యులు అడిగారు. 'బోధకుడు' అంటే 'విజ్ఞాన మూలము' అని అర్థం 'నివశించుట', గ్రీకు భాషలో 'మెనేయిన్' అని, ఆంగ్లంలో అని, తెలుగులో 'నివశించుట' అని తర్జుమా చేయబడింది. మెనేయిన్ అన్న గ్రీకు పదం 'ఉండుట' అన్న అర్థాన్నే ఇస్తుంది. దీని ప్రకారం వారి ప్రశ్నను తిరిగి చెప్పాలంటే మీరు ఎక్కడ ఉంటున్నారు? మిమ్ముల్ని మేము ఎక్కడ కనుగొనగలం? మేము మిమ్ముల్ని కనుగొనాలంటే మేము ఎక్కడికి పోవాలి? మీతో ఉండడానికి మేమేమి చెయ్యాలి? మా జీవితంలో ఎప్పుడు మిమ్మల్ని కలుసుకోగలం? అని రాయాల్సి యుంటుంది. ఈ భావమే యేసుప్రశ్నకు వారి సమాధానమైతే 'మీకేమి కావలయును'? అన్న యేసుప్రశ్న ఉచితమైంది.

"బోధకుడా! నీవు ఎక్కడ నివశించుచున్నావు?" అన్నవారి ప్రశ్నకు యేసు, "వచ్చి చూడండి" అని సమాధానమిచ్చారు. యేసును తెలుసుకోవడం, ఆయన నివశించే స్థలం కన్నుక్కోవడం ప్రధానంగా తెలివితేటలకు సంబంధించింది, సమాచారానికి సంబంధించింది ఏమి కాదు. అదో గొప్ప దైవశాస్త్రం నేర్చుకోవడమో, సైద్ధాంతికమైన విషయమో లేదా నైతిక శాస్త్రమో కాదు. లేదా శ్రీసభ బోధనలో నిష్ణాతులు కావడం, లేదా శ్రీసభ చట్ట అధ్యయనంలో ప్రత్యేకతను సంపాదించడమేమి కాదు. ఆ మాటకొస్తే ఇవన్నింటిలో పరిసయ్యులు ఉద్దండులే. యేసును గూర్చి వారికి మంచి పరిజ్ఞానం ఉంది. కాని ఆయన్ను గూర్చిన అనుభవం లేదు.

**అనుభవం ప్రధానం:** యేసును తెలుసుకోవడం అనుభవానికి సంబంధిచింది. కతోలిక సత్యోపదేశంలో సత్యాలన్ని, అధికరణలన్నీ ఓ వ్యక్తి తెలుసుకోవచ్చు. కంఠస్థం చెయ్యొచ్చు. బైబులు అంతా కంఠస్థం చెయ్యొచ్చు. అయినా యేసును గూర్చి సదరు వ్యక్తికి ఏమి తెలియకపోవచ్చు. అంటే యేసును ఆయన జీవితంలో ఎప్పుడూ అనుభవించియుండడు. సువార్తా ప్రకారం యేసును వెతకడం, వెతికి కనుగొని ఆయన ప్రేమపూర్వక సన్నిధికి, మన దైనందిన జీవితంలో తగిన ప్రత్యుత్తర మివ్వడమే ఆయన్ను తెలుసుకోవడం అవుతుంది. అంటే ఆయన జీవనరీతిని మన జీవితంలో క్రియారూపంలో ప్రదర్శించడమే ఆయన్ను తెలుసుకోవడం అన్పించుకొంటుంది.

యేసుక్రీస్తు బోధనా సారాంశం వ్యతిరేకమైనదని అనేకమంది అనుకొన్నా వారి ఆలోచనను లెక్కచేయక ఆయన బోధనను ఆచరణలో పెట్టడంలో నిమగ్నం కావడమే ఆయన్ను తెలుసుకోవడమంటే. ఎట్టి షరతులు లేకుండా ప్రేమను ప్రదర్శించడం, ఇతరులను మన్నించడం, ఒక చెంపపై కొడితే రెండో చెంపను చూపడం, తన స్లీవను ఎత్తుకొని యేసును వెంబడించడం, ఆయన శిష్యుడైనందుకు లోకం ద్వేషిస్తే, హింస పెడితే సంతోషంతో దాన్ని స్వీకరించడమే యేసును తెలుసుకోవడమవుతుంది.

'వచ్చిచూడండి, పరిశీలించండి, అర్థం చేసుకోండి, ఆచరించండి, నా మార్గంలో పయనించండి' ఇదే యేసు ప్రభుని పిలుపు.

**ప్రభువుతో అనుభవాన్ని పంచుకోవడం:** యేసు పిలుపును ఆ యిద్దరు శిష్యులు అంగీకరించారు. యేసుతోపాటు వెళ్ళి ఆయన ఉన్నచోట ఆ రోజు సాయంత్రం వరకూ ఆయనతో గడిపారు. అలా ఆయనతో గడిపినందువల్ల వచ్చిన ఫలితమేంటి? ఈ యిద్దరిలో ఒకరు ఆంద్రేయ, అంకిత బావం నిండిన యేసు అనుచరుడవడమే గాకుండా ఓ సువార్తీకుడు అయ్యారు. వాస్తవానికి అనుచరుడవడం, సువార్తను బోధించడం రెండూ కలిసిపోయే ప్రక్రియలు. యేసును తెలుసుకొని అనుభవించిన ఆంద్రేయ సంతోషంతో వెంటనే ఇంటికి వెళ్ళి తన సోదరుడు సిమోనును కలిసి అతనితో 'మేము మెస్సయాను కనుగొంటిమి' అని చెప్పాడు. అలా ఆంద్రేయ యేసుతో తనకున్న అనుభవాన్ని తన సోదరునితో పంచుకోవడం వల్ల అతనిలోను ఆసక్తి కలిగి ఆంద్రేయను అనుసరించి యేసు యొద్దకు రాగా, "నీవు యోహాను కుమారుడవగు సీమోనువు. నీవు 'కేఫా' అని పిలువబడుదువు అన్నారు.

ఇక్కడ గమనించదగ్గ విషయమేమిటంటే భవిష్యత్తులో పేతురు యేసు సంఘానికి, శ్రీసభకు నాయకుడు అవబోతున్నప్పటికీ ఆయన ప్రత్యక్షంగా పిలువబడలేదు. ఆంద్రేయ ద్వారా ఆయన యేసును తెలుసుకోవడం వల్ల ఆయన పిలుపును పొందాడు. అలాంటివి శ్రీసభలో, రక్షణ చరిత్రలో అనేకం జరిగాయి. గొప్పగొప్ప నాయకులు, గొప్ప పుణ్యాత్ములతో సహా ఎక్కువమంది ఇతరుల ద్వారా పిలువబడ్డారు. తరచుగా అలా 'పిలుపులు' తక్కువ ప్రాధాన్యం ఉన్నవాళ్ళ వల్లనే సంభవించాయి. మనలో ప్రతియొక్కరు మరో వ్యక్తిద్వారానే యేసును తెలుసుకొన్నాం. ఆయన పిలుపుకు అర్హులమయ్యాం.

ఈనాటి మొదటి పఠనంలో ప్రవక్తల్లో ఆద్యుడైన సమూయేలు పిలుపుగూడ ఏలి యాజకుని మధ్యవర్తిత్వం ద్వారానే జరిగింది. వృద్ధుడైన ఏలి యాజకుడు, సమూయేలు తన పిలుపును గ్రహించడానికి దోహదం చేశాడు. ఈనాటి సువిశేష పఠనంలో బప్తిస్త యోహాను, ఆంద్రేయ క్రైస్తవ శిష్యరిక ప్రోత్సాహానికి, ఉన్నతికి తోడ్పడ్డారు.

మనుష్యావతారమెత్తిన దైవవాక్కును అర్థం చేసుకొని, అనుభవించి, ఆయన్ను అనుసరించ ఇతరులను పురిగొల్పడానికి వారు దేవుని చేతిలో పనిముట్లుగా తమ కర్తవ్యాన్ని కడుదీక్షతో నిర్వర్తించారు. ఆంద్రేయ సిమోనును యేసునొద్దకు తీసికొనిపోయి యేసుకు అతనుగూడ శిష్యుడు అయ్యేలా చేశాడు. అది ఆంద్రేయ అపోస్తలుడుగా మొదటి కార్యసాధన. పేతురును యేసు యొద్దకు, తీసుకురావడం ద్వారా అపోస్తులుల అపోస్తలుల సంఖ్యను పెంచినట్టయింది. అందుమూలంగా యేసు పేతురును శిష్యులకు నాయకుడుగా చేయగలిగారు. ఆంద్రేయ, పేతురులో నాటిన ఆసక్తి బీజం దినదిన ప్రవర్థమానమై అతన్ని శ్రీసభ నాయకుడయ్యే స్థితికి చేర్చింది.

ప్రస్తుతం శ్రీసభకు అత్యవసరమైన పరిచర్య అదే. నిస్వార్థపరులు, దైవ పిలుపుల ప్రోత్సాహానికి అంకితులైన వాళ్ళు ఎంతో అవసరం. దేవుని పిలుపు అనే విత్తనాలను చల్లి అవి ఫలించేలా చేసే వాళ్ళ అవశ్యకత శ్రీసభకు ఎంతో ఉంది.

దైవ పిలుపు అంశంపై ధ్యానిస్తున్న మనం, మనో పరిశీలన గావించుకోవాలి.

**1.** నేను ఏమి చెయ్యాలని ఈరోజు, ఇప్పుడు దేవుడు పిలుస్తున్నారు? ప్రభువు చెప్పే దాన్ని ఆసక్తితో అభిలాషతో వినడానికి నేను సిద్ధంగా ఉన్నానా?

**2.** యేసుయొద్దకు వెళ్ళనాశించిన వారు నా సహాయం కోసం ఎంత మంది ఎదురు చూస్తున్నారు?

**3.** 'వచ్చి చూడండి' అన్న ఆహ్వానాన్ని అందుకోవడానికి ఎంతమంది వేచియున్నారు? వారిపట్ల నా బాధ్యత ఏంటి? నా వైఖరి ఏంటి?

యేసుయొద్దకు రావాలని ఆయన్ను వినాలని, ఆయన్ను గూర్చి తెలుసుకోవాలని ఎంతో మంది ఆశతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. క్రైస్తవులంగా, యేసును అనుభవంలో తెలుసుకొన్న వారలంగా మనం ఎంత వరకు అటువంటి వారికి సమాయం చేస్తున్నాం? ఆ గురుతర బాధ్యతను గుర్తెరిగి మసలుకొంటున్నాం? ఆలోచించండి. ప్రభువు డెబ్బయిరెండు మంది శిష్యులను నియమించి తాను స్వయంగా వెళ్ళవలసిన ప్రతి పట్టణమునకు, ప్రతి ప్రాంతమునకు వారిని ఇద్దరిద్దరి చొప్పున ముందుగా పంపుతూ, వారితో "పంట విస్తారము కాని పనివారు తక్కువ. కనుక తన పంట పొలమునకు పనివారిని పంపవలసినదిగా యజమానుని ప్రార్థింపుడు" అన్నారు. మీరు పొండు. ఇదిగో! తోడేళ్ళ మధ్యకు గొర్రెపిల్లల వలె మిమ్ము పంపుచున్నాను" అని ఉద్బోధించారు. అలనాడు పలికిన యేసుప్రభుని ఈ పలుకులు మన కాలానికి, ఇప్పటి పరిస్థితులకు ఎంతో దగ్గరగానున్నాయి. మరి ప్రభుయేసుని పిలుపును అంగీకరించి, పాటించడానికి గట్టిగా ప్రయత్నిద్దాం. మన ప్రయత్నంలో ప్రభుయేసు అండదండలు, అనుగ్రహాలు మెండుగా లభించుగాక! ఆమెన్.

# సామాన్య 3వ ఆదివారం
# 21-01-2018

**యోనా 3:1-5,10　　1కొరింతీ 7:29-31　　మార్కు 1:14-20**

## రాజ్యంలో భాగం

యేసు తన బహిరంగ జీవితాన్ని ప్రారంభించి ప్రజలకు తన సువార్తను అందజేయ మొదలు పెట్టాడు. అనేక విషయాలు బోధించాడు. ఈ దినం సువార్తాపఠనం యేసుక్రీస్తు బోధనంతా ఒక వాక్యంలో ఇమిడ్చి చెప్తుతుంది. "కాలము సంపూర్ణమైనది. దైవ రాజ్యము సమీపించినది. హృదయ పరివర్తనము చెంది, ఈ సువార్తను విశ్వసింపుడు" (మార్కు 1:15). దైవరాజ్యాన్ని స్థాపించి అందరను దానిలో చేర్చటానికి క్రీస్తు ఈ లోకానికి వచ్చారు. అదే ఆయన జీవిత ధ్యేయం, అభిలాష. అదే ఆయన మనకు అందించిన శుభవార్త. ప్రతి వ్యక్తి హృదయ పరివర్తన చెంది విశ్వాసంతో ఆ రాజ్యంలో ప్రవేశించాలని, భాగస్వాములు కావాలని ఆయన కోరిక. కనుక మనం ఆ రాజ్యం యొక్క స్వభావం, తీరుతెన్నులు, దానిలో చేరటానికి షరతులు తెలిసికోవటం అవసరం.

## తీరుతెన్నులు

దేవుడు లోకానికి సృష్టికర్త కనుక ఆయన దానికి అధిపతి, రాజు. పూర్వవేదంలో ఆయన ప్రత్యేకంగా ఇస్రాయేలీ ప్రజలకు రాజుగా పరిగణింపబడ్డాడు. అయితే ఆయన మానవులందరకు రాజుగా ప్రపంచమంతట తన రాజ్యాన్ని భవిష్యత్తులో ఒకప్పుడు స్థాపిస్తాడని ప్రవక్తలు ప్రజలకు బోధించారు. రాబోవు ఆయన రాజ్యాన్ని అనేక విధాల చిత్రించారు. ఇస్రాయేలీ ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోల్పోయి శత్రువులకు బానిసలైనపుడు రాబోవు దేవుని రాజ్యాన్ని వారు వేరొక విధంగా పరిగణించటం మొదలుపెట్టారు. రాబోవు కాలంలో యావే ప్రభువు మెస్సయా ద్వారా తన రాజ్యాన్ని ఇస్రాయేలీ ప్రజలకై స్థాపించి, వారిని శత్రువుబారినుండి విముక్తిచేసి, వారికి శాంతి సమాధానం, సిరిసంపదలు చేకూరుస్తాడని కలలు కన్నారు. ప్రజలు ఊహాగానంలో ఆధ్యాత్మికమైన దేవుని రాజ్యం రాజకీయమైంది. మెస్సయా స్థాపించబోయే సార్వజననీకమైన, అంతర్జాతీయమైన రాజ్యాన్ని యూదుల జాతీయమైన రాజ్యంగా తమ జాతికి మాత్రమే వర్తిస్తుందని భావించారు. యేసుక్రీస్తు ఈ లోకంలో అవతరించిన కాలంలో యూదులు స్వాతంత్ర్యరహితులై రోమను చక్రవర్తి పాలనలోనుండి స్వరాజ్యానికై ఉవ్విళ్ళూరుతుండేవారు. మెస్సయ యూదుల శత్రువులను

జయించి వారికి స్వాతంత్ర్యం, సిరిసంపదలు సమాధానం చేకూర్చి వారి రాజుగా కలకాలం పరిపాలన చేస్తాడని ఆశించారు. అందువల్లనే ఆంతరంగికమైన ఆధ్యాత్మికమైన రాజ్యాన్ని స్థాపించటానికి వచ్చిన క్రీస్తును వారు తిరస్కరించారు. వారి ఆశలన్నీ నిరాశలైనాయి.

## ముఖ్య షరతులు

దేవునిరాజ్యం క్రీస్తునందు అవతరించింది. అది సార్వజనీనకమైంది, ప్రతియొక్క మానవునికి చెందినది. రాజకీయ శత్రువులనుండిగాక, మానవాళికంతకు పరమశత్రువైన సైతానునుండి విముక్తిని ప్రసాదించటానికి క్రీస్తు వచ్చారు. ఐహిక సిరిసంపదలుగాక, ఆధ్యాత్మిక సంపదను, జీవాన్ని అందజేయటమే ఆయన ధ్యేయం. పాలస్తీన దేశంపై గాక, ప్రజల హృదయాలపై, అంతఃకరణాలపై ఆయన తన రాజ్యాన్ని స్థాపించదలచాడు. ప్రతి ఒక్కడు తన రాజ్యంలో ప్రవేశం పొందాలని ఆయన అభిలషించాడు. అందుకు రెండు ముఖ్యమైన షరతులను నియమించాడు. 1.హృదయపరివర్తనం. 2. విశ్వాసం

హృదయపరివర్తన అంటే సైతానుని వదిలి క్రీస్తుని అంగీకరించటం పాపాంధకారంనుండి సజీవ కాంతిలోనికి పయనించటం, క్రీస్తును మన జీవితంలోనికి ఆహ్వానించి ఆయనయందే మన జీవిత ఆనందాన్ని పొందటం. జ్ఞానస్నానంలో మనం పిశాచమును దాని శక్తులను విసర్జించి, యేసుక్రీస్తు రాజ్యంలో చేరాం. పాపానికి ఎప్పుడూ దూరంగా ఉంటూ, క్రీస్తునందు పురోగమిస్తానని ఆ తరుణంలో వాగ్దానం చేశాం. అయితే పాపం మనలనెల్లప్పుడు వెన్నంటుతూనే ఉంటుంది. కనుక హృదయ పరివర్తన మనకు ఎప్పుడు అవసరం. క్రీస్తు రాజ్యంలో మనం పురోగమించాలంటే అనుదినం మనం హృదయ పరివర్తన చెందుతూండాలి. మన వైఖరిలో, తలంపులో మార్పురావాలి. అనుదినం మనం కలిసిమెలిసి జీవిస్తున్న సోదరులతో, పొరుగువారితో మనకు సమాధానం లేకపోతే దేవునితో మనకు సమాధానం లేనట్లుగా భావించాలి. సోదరప్రేమ లేనివాడు దైవప్రేమను చూడలేడు. మనలోనున్నట్లే ఇతరులలోకూడ క్రీస్తు తన రాజ్యాన్ని స్థాపించుకొని ఉన్నాడు. వారి హృదయాలపై ఆయన ఆసీనుడై ఉన్నాడని మనం గుర్తించాలి. పరస్పర ప్రేమ, సహకారంవలన క్రీస్తుని రాజ్యం  పటిష్టం కాగలదు.

క్రైస్తవులమధ్య ప్రేమబంధం బిగుతుగా ఉన్నప్పుడే వారిలో నిజమైన హృదయపరివర్తన నెలకొన్నదని చెప్పవచ్చు. అయితే మానవ బలహీనత వలన ఆ ప్రేమ సన్నగిల్లుతూ ఉంటుంది. అనేకసార్లు పూర్తిగా తెగిపోతుంది. అందుకే హృదయ పరివర్తన ప్రతియొక్కనికి తరచుగా అవసరం. క్రీస్తు మనలను హృదయపరివర్తనకై అనుదినం ఆహ్వానిస్తున్నారు. ఆ ఆహ్వానాన్ని మానవులు పెడచెవిన పెడుతుంటారు. మరి కొందరు అహంకారంతో దానిని పూర్తిగా తిరస్కరిస్తుంటారు. అట్టి వారిని గూర్చి పరిశుద్ధగ్రంథం పలుకునదేమన: "నేను చేసిన బోధ ఏమియు మీరు వినక త్రోసివేసితిరి. నేను గద్దింపగా

లోబడి పోతిరి. కాబట్టి మీకు అపాయం కలుగునపుడు నేను నవ్వెదను. మీకు భయము కలుగునపుడు నేను అపహాస్యము చేసెదను, అప్పుడు వారు నన్ను గూర్చి మొర పెట్టుదురు గాని నేను ప్రత్యుత్తరమీయకుందును, నన్ను శ్రద్ధగా వెదకెదరుకాని నేను కనబడకుందును" (సామె 1:24-28).

విశ్వాసం కలవాడే క్రీస్తుని రాజ్యంలో భాగస్వామి కాగలడు. విశ్వాసం లేనిదే రక్షణలేదు. విశ్వాసం లేనిచోట క్రీస్తుకు స్థానంలేదు. విశ్వాసంతో నిజమైన క్రైస్తవ జీవితం జీవించు వానియందు క్రీస్తురాజ్యం ప్రత్యక్షమై యున్నదని మనం భావించాలి. మన విశ్వాసం గట్టిగా ఉండాలి. దానిని మనం ఒక అమూల్యమైన వరంగా, సంపదగా పరిగణించి కాపాడుకొంటూ ఉండాలి. శ్రీసభ చరిత్రలోని ప్రధమ క్రైస్తవులు అందుకు మనకు మాతృక. క్రైస్తవులు ప్రధమ దశలో ఎన్నో హింసలకు గురియైనారు. క్రీస్తునందు వారి విశ్వాసాన్ని విసర్జించమని, వారి మతాన్ని విడనాడమమని రోమను చక్రవర్తులు వారిని శతవిధాల హింసించారు. వారిని చెరసాలలో వేశారు. వికలాంగులను చేశారు. ఇంకా ఎన్నో విధాల బాధించారు. అయితే క్రైస్తవులు క్రీస్తును విడనాడక విశ్వాసంతో అన్నింటిని భరించారు. "బహిరంగముగ ప్రజల యెదుట నన్ను అంగీకరింపమని ప్రతివానిని పరలోకమందున్న నా తండ్రి సమక్షమున నేనును అంగీకరింపను" అని క్రీస్తు పలికిన పలుకులను వారు జ్ఞప్తియందుంచుకొన్నారు. మనకు ఇట్టి హింసలు లేకపోయినా మనం కష్టాలలో జీవిత సమస్యలలో చిక్కుకొని గాడాంధకారంలో పడినప్పుడు విశ్వాసపు వెలుగును కోల్పోరాదు.

మన విశ్వాసం గట్టిదైయుండి, దాని ఆజ్ఞలకు తగినట్లుగా మనం జీవించాలి. "ప్రభూ! ప్రభూ! అని నన్ను సంబోధించువాడు పరలోక రాజ్యంలో ప్రవేశింపడు; పరలోకమందలి నా తండ్రి చిత్తానుసారముగా జీవించువాడే పరలోక రాజ్యమున ప్రవేశించును" అని క్రీస్తు చెప్పారు. పేరుకు మాత్రమే క్రైస్తవులుగా మనలో ఎంత మందిలేరు! క్రీస్తు బోధను, ఆజ్ఞలను అనుదిన జీవితంలో ఆచరింపక క్రైస్తవులమని చెప్పుకొనేవారు ఎందరు లేరు! అట్టివారిని గూర్చి పరిశుద్ధగ్రంథం పలుకునదేమన: నా సహోదరులారా! ఏవ్యక్తియైనను 'నాకు విశ్వాసమున్నది' అని చెప్పుకొనుచూ, అతని క్రియలు దానిని నిరూపింపకున్నయెడల, దానివలన ప్రయోజన మేమి? ఆ విశ్వాసమతనిని రక్షింపగలదా? కూడు గుడ్డలకొరకు అక్కచెల్లెంద్రుగాని, అన్నదమ్ములుగాని అలమటించుచున్నచో వారి జీవితావసరములను తీర్చక, 'దేవుడు మిమ్ము దీవించునుగాక! చల్లగా జీవించు. హాయిగా భుజింపుడు!" అని మీలో ఎవడైన పలికిన యెడల ప్రయోజనమేమి? కనుక దానినుసరించి పనులొనర్పబడనిచో కేవలం విశ్వాసం నిర్జీవమే. దాని తీరు అట్టిది" (యాకోబు 2:14-17).

తుది తీర్పు సమయంలో దేవుని సమక్షమున మనం క్రైస్తవులమని చెప్పుకుంటే సరిపోదు. క్రైస్తవులంగా జీవించామని చెప్పుకోగలగాలి. అట్లు కానిచో మనకు రక్షణభాగ్యం లభించక పోవటమే కాక మనకు కఠినశిక్ష విధింపబడుతుంది. ఒకానొకరోజున మకారియుస్ అనే వ్యక్తి ఒక ఎడారిలో పయనిస్తుండగా ఒక పుర్రెను చూశాడు. దానిని కర్రతో తట్టగా అది జీవం పొంది మాట్లాడ ప్రారంభించింది. "నీ వెవరవు?" అని మకారియుస్ ఆ పుర్రెను అడుగగా "అన్యమతానికి చెందిన ఒక యాజకుని తలను, ఒకప్పుడు ఈ ఎడారిలో జీవించాను. నిజమైన దేవుని తెలిసికొనటానికి నేను మనస్సాక్షి ప్రకారం ప్రతయత్నించలేదు, కాబట్టి నేను శిక్షింపబడ్డాను" అని అది సమాధానమిచ్చింది. అప్పుడు మరల మకారియుస్ 'చనిపోయిన క్రైస్తవుని స్థితి ఏ విధంగా ఉంది?' అని ప్రశ్నింపగా 'క్రైస్తవులలో అనేకమంది అన్యులైన మాకంటే ఎంతో ఎక్కువగా శిక్షింపబడుతున్నారు' అని ఆ పుర్రె సమాధానమిచ్చిందట. ఈ కథ మనకందరకు కనువిప్పుగా ఉండాలి.

## క్రీస్తు ఆహ్వానం

యోనా ప్రవక్త నినివే పౌరులకు తమ పాప జీవితాన్ని ఎరిగించి, హృదయ పరివర్తన చెందుడని బోధింపగానే వారు విధేయించారు. నినివే పౌరులు యూదేతరులు అనగా దేవుని రాజ్యం అన్యులకు గూడ వర్తిస్తుందని, అది సార్వజనీనకమైనదని మనం ఈ దినం మొదటి పఠనంలో తెలిసికొంటున్నాం. వారు దేవుని పిలుపును వెంటనే ఆలకించి ఆయన రాజ్యంలో చేరదలచారు. అట్లే ఈ దినం సువార్తా పఠనంలో యేసు బెస్తలను పిలువగానే వారు తమ పనిని వెంటనే వదిలిపెట్టి వెనుదిరిగి చూడక ఆయన్ని వెంబడించారు. (మార్కు 1:16-20).

క్రీస్తు మనల నాహ్వానిస్తున్నారు. మనం నిశ్చలమైన తీర్మానం చేసుకొని ఆయన్ని వెంబడించాలి. కుటుంబ బంధాలుగాని లేక ఇతర చింతలుగాని మనకు అడ్డురాకూడదు. ఆయన్ని పూర్తిగా అనుసరించి సేవించాలి. ఎవడును ఇద్దరి యజమానులను సేవింపజాలడు. కనుక దైవమును, ద్రవ్యమును మనం సేవింపజాలము. మన అనుసరణ, సేవ సంపూర్ణమైనప్పుడే ఆయన రాజ్యంలో మనం పటిష్ఠంగా ఉండగలం.

# సామాన్య 4వ ఆదివారం
# 28-01-2018

***ద్వి.కాం. 18:15-20 1కొరిం. 7:32-35 మార్కు 1:21-28***

## బంధ విముక్తుల్ని చేసే యేసు అధికారం

"విజ్ఞాన పూరితము కాని అధికారం పదునులేని బరువైన గొడ్డలిలాంటిది. అది చితక కొట్టడానికే గాని శోభ తేవడానికి ఉపయోగపడదు" ఆన్నె బ్రాడ్‌స్ట్రీట్

**సంఘటన:** పూర్వకాలం ఫ్రాన్స్ దేశంలో సన్యాసుల ఆశ్రమం ఒకటి ఉండేది. అది ఐరోపా ఖండం అంతట ప్రసిద్ధిగాంచింది. దానికి ఆ పేరు రావడానికి కారణం ఆ ఆశ్రమం నాయకుడు బ్రదర్ లియో. ఆయన నాయకత్వం అమోఘమైందిగా వాసికెక్కింది. ఆయన నాయకత్వ లక్షణాలను గూర్చి విన్న అనేక మంది ఆయన్ను స్వయంగా చూడడానికి తండోప తండాలుగా అక్కడికి వెళ్ళేవారు. చాలామంది ఆ ఆశ్రమాన్ని ఓ పుణ్యక్షేత్రంగా పరిగణించి ఆయన్ను దర్శించుకోడానికి పోయేవాళ్ళు.

ఓసారి పొరుగుదేశంలో నున్న కొంత మంది ఆశ్రమవాసులు బ్రదర్ లియోను చూడాలని ఓ యాత్రను సంకల్పించారు. అయితే ఆ యాత్రలో ఎవరు ఏపని చేయాలి అన్న విషయంలో వారి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకొన్నాయి. అలా వారి ప్రయాణం గొడవలు, గొణగడాలతో కొనసాగుతూ ఉన్న సమయంలో వారితో ప్రయాణం చెయ్యడానికి మరో సన్యాసి కలిశాడు. ఆయన ఆ సన్యాసుల సమూహంలో చేరినప్పటి నుండి వారి ప్రయాణం ప్రశాంతంగా కొనసాగింది. కారణమేమంటే ఆ సమూహంలో ఎవరెవరు తమ విధిని నిర్వర్తింపకున్నా కొత్తగా వచ్చిన సన్యాసి ఆయా పనులను చేస్తుండేవారు. కాబట్టి అంతా సవ్యంగా కొనసాగి బ్రదర్ లియో ఆశ్రమం చేరుకున్నారు. ఆ తరువాత వాళ్ళు, "మాకు బ్రదర్ లియోను చూడాలని ఉంది. ఆ విషతోటే ఎన్నో కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చాము" అని ఆశ్రమ వాసుల్లో ఒకరిని అడిగారు.

అప్పుడు ఆ ఆశ్రమ వాసి నవ్వుతూ, "మా పెద్ద, బ్రదర్ లియో మీతోనే వచ్చారే! ఇప్పుడు మీలోనే ఉన్నారు గదా!" అని సమాధానమిచ్చాడు. "అదుగో మీ సామాను గదుల్లోకి సర్దుతుంది బ్రదర్ లియోగారే" అని బ్రదర్‌ని చూపించాడు. ఆ దెబ్బతో నోటి మీద వేలేసుకున్నారు వచ్చిన వాళ్ళంతా.

నాయకులకు, పెద్దలకు బ్రదర్ లియో స్ఫూర్తిదాయకమైతే ప్రపంచం మరోలా ఉండేది గదా!

**ఉపోద్ఘాతం:** పూర్వవేదంలో దేవుడు చేసిన వాగ్దానాల్లో అనేకం యేసుక్రీస్తునందు నెరవేరాయి. అలాంటి వాగ్ధానాల్లో ఒకటి: దేవుడు నూతన మోషేను పంపుతాననడం ఆ

నూతన మోషే వచ్చెడి దేవుని వాగ్ధానం పరిపూర్తి అయిన విషయాన్ని ఈనాటి పూ.ఆపఠనాలు విశదం చేస్తున్నాయి.

**పరిశుద్ధ 16వ బెనెడిక్టు పాపుగారు:** ప్రస్తుతం శ్రీసభనేత 16వ బెనెడిక్టు పాపుగారు 'నజరేయుడైన యేసు' అన్న గ్రంథం రాశారు. దాన్నే ఆంగ్లంలో అన్న పేరుతో వ్రాశారు. ఈ గ్రంథంలో ఒక అధ్యాయంలో నేటి పఠనాలపై వ్యాఖ్యానించారు. ఈనాటి మొదటి పఠనంలోని అంశం 'దేవుడు వాగ్దానం చేసిన నూతన మోషే' నేటి సువార్తా పఠనంలోని యేసుక్రీస్తు సువార్తా ప్రచారం ఆరంభఘట్టాన్ని పోలుస్తూ, ఆనాడు దేవుడు మోషే ద్వారా చేసిన వాగ్దానం నూతన మోషే యేసుక్రీస్తునందు పరిపూర్తి అయిన విధానాన్ని స్పష్టం చేశారు. పాపుగారు చేసిన ఆ వివరణను ఇక్కడ పరిశీలిద్దాం.

నూతన వేదంలో వర్ణింపబడిన యేసుక్రీస్తు జీవితాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే ద్వి.కాం. 18:15-20 వచనాల్లో వాగ్దానం చేయబడిన నిగూఢ ప్రవక్త దగ్గర మన పరిశీలన ప్రారంభించాలి అంటారు పాపుగారు. ఆ వాగ్దానం ప్రవక్తల ప్రవచనా వ్యవస్థ కంటెను, మహా గొప్ప ప్రవక్త మోషే కంటెను, ఈ కథనం రాయబడిన సందర్భం కంటెను ఇంకా ముందుకు తీసుకెళ్తుంది మనల్ని అని వివరిస్తారు పాపుగారు.

**గ్రంథ నేపథ్యం:** దేవుని ప్రజలైన యూదులు బాబిలోనులో బానిస జీవితం అనుభవించి తిరిగి వాగ్ధాన భూమి చేరుకొని కొన్ని శతాబ్ధాలు గడిచిన తరువాత రాయబడింది ద్వితియోపదేశకాండం. అప్పటికీ ఆ ప్రజల్లో ఏదో తెలియని వెలితి, అసంతృప్తి, ఓ రకమైన విశాదచాయలు కనబడుతూనే ఉన్నాయి. కారణం దేవుడు చేసిన వాగ్ధానం 'మోషే లాంటి ప్రవక్త' ఇంకా అవతరించకపోవడం. ద్వితీయోపదేశకాండం చివరి వాక్యాల్లో ఇలా రాయబడింది, "నాటి నుండి మోషే వంటి ప్రవక్త యిస్రాయేలీయులలో మరల పుట్టలేదు. ప్రభువు అతనితో ముఖాముఖీ సంభాషించెను" దీని వల్ల మనకు అర్థమయ్యేదేంటంటే వాగ్ధాన భూమియైన పాలస్తీనా దేశాన్ని యిస్రాయేలీయులు స్వాధీనం చేసుకున్నా వారు ముక్తికి ఇంకా వారసులు కాలేదు, రక్షణ పొందలేదు. ఆ యిస్రాయేలీయులు స్వేచ్ఛ, రక్షణ కోసం ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు. అప్పుడు వారు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాల అనుభవం కంటె ఎన్నో రెట్లు ఎక్కువైన, మహోన్నతమైన స్వేచ్ఛ కోసం, నూతన మోషే సాధించే సిసలైన విముక్తి కోసం ఎదురుచూస్తున్నారు. పూర్వనిబంధనకాలంలో మోషే మహాగొప్ప ప్రవక్త, నాయకుడు, ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన మహామనిషి. ఇతర ప్రవక్తలకంటె నాయకులకంటే శ్రేష్ఠమైన స్థితిలో అతన్ని ఉంచిన విషయం ఆయన చేసిన అద్భుతాలు కావు. ఇస్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వం నుండి వాగ్ధాన భూమికి నడిపించడంలో ఆయన అనుభవించిన బాధలు త్యాగాలు, చూపిన ఔదార్యం, ప్రదర్శించిన నాయక లక్షణాలూ

కావు. మోషే జీవితంలో చాటిలేని, విశిష్ఠమైన విషయం ఏంటంటే ఆయన "దేవునితో ముఖాముఖిగా" ఓ మనిషి తన స్నేహితునితో మాట్లాడిన చందంగా సంభాషించడం. మోషే జీవితంలోని ఈ విశిష్ఠ అవకాశమే ఆయన సాధించిన కార్యాలకు, చేసిన ధర్మశాస్త్రానికి, యిస్రాయేలీయులకు చూపిన మార్గానికి ఆధారమయింది, మూలమయింది. ఆ ప్రత్యేకతే, ఇస్రాయేలీయుల బానిస చరిత్రను స్వేచ్ఛా చరిత్రగా మార్చే శక్తి ఆయనకు అనుగ్రహించింది.

**నూతన ప్రవక్త:** నూతన వేదంలో యేసుక్రీస్తునందు ఆ 'నూతన ప్రవక్త' వాగ్దానం నెరవేరింది. ఆ వాగ్దానం ఇంకా ఎక్కువ అద్భుత విధంగా నెరవేరిందనే చెప్పాలి. ఈ విషయాన్ని పాపుగారు ఇలా వివరిస్తున్నారు. మోషేకు దేవునితో సన్నిహితత్వం ఉన్నప్పటికీ దేవుని గూర్చి విషయాలు ఆవిష్కరించడంలో తెలియజేయడంలో మోషేకు కొన్ని పరిమితులు, అవధులు ఉన్నాయి. ఎందుకంటె ఆయన దేవునితో ముఖాముఖీగా మాట్లాడినప్పటికీ దేవుని ముఖాన్ని చూడడానికి ఆయనకు అనుమతిలేదు. కేవలం ఆయన దేవుని వెనుకభాగం మాత్రం చూడగలిగాడు. "నీవు నా ముఖమును దర్శింపజాలవు. నా పృష్ఠభాగమును మాత్రము కనుగొందువు" అంటుంది నిర్గమ కాండం.

అయితే నూతన మోషే అయిన యేసుక్రీస్తు దేవుని ముఖాన్నే చూశారు. ఆయన సన్నిహితాన్ని, సాదృశ్యాన్ని అనుభవించారు. ఆ విషయాన్నే యోహాను సువార్త స్పష్టం చేస్తుంది. "ఎవరును, ఎప్పుడును దేవుని చూడలేదు. కాని, తండ్రి వక్షస్థలమున ఉన్న జనితైక పుత్రుడే ఆయనను ఎరుకపరచెను" (యోహాను 1:18). దేవుని పుత్రుడై, యేసు, ఆయన వక్షస్థలము నుండి ఉద్భవించిన యేసు దేవుని గూర్చి సొంతం మానవాళికి తెలియజేయ సమర్థుడు. ఈ యేసుక్రీస్తునందే అలనాడు మోషే ద్వారా ప్రవచింపబడిన 'నూతన మోషే' వాగ్దానం పరిపూర్ణంగా నెరవేరింది. అని సంక్షిప్తంగా ముగించారు పాపుగారు. యేసుక్రీస్తు నందు సంభవించిన సంపూర్ణ దైవావిష్కరణలో కొంత భాగం మాత్రమే మోషే ప్రవక్త ద్వారా ఆవిష్కరింపబడింది. యేసుక్రీస్తు, దేవుని సమక్షంలో కేవలం ఓ స్నేహితునిగా కాకుండ కుమారునిగా జీవించారు. దేవునితో అత్యంత సన్నిహితమైన ఐక్యత కలిగి జీవించారు.

**యేసు ప్రత్యేకత:** యేసు అధికారయుతమైన బోధనపట్ల ఆనాటి ప్రజలు ఆశ్చర్యమొందినట్టు సువార్తలో మనం విన్నాం. ఆయన బోధించిన విషయాల పట్ల ప్రజలు ముగ్ధులయ్యారు. అంతేగాకుండా యేసుక్రీస్తు యొక్క శక్తిమంతమైన వాక్కులతో పాటు ఎంతో శక్తిమంతమైన ఆయన కార్యాలను ఈ సువార్త ప్రదర్శిస్తుంది. ఓ మనిషిని ఆవేశించిన అపవిత్రాత్మను

గద్దించి ఆ మనిషి నుండి వెలుపలికి రమ్మని యేసు గద్దించగానే ఆ అపవిత్రాత్మ విధేయించింది.

“యేసుక్రీస్తుకు ఆ బోధనా శక్తి ఎక్కడ నుండి వచ్చింది?” అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు అక్కడి ప్రజలు. మనకూ అదే ఆశ్చర్యం, సందేహం కలుగుతుంది. యేసు బోధన నభూతోనభవిషత్... అని వివరిస్తున్నారు పాపుగారు. అది నేర్చుకొన్నందువల్లనో అనుభవం ఘడించినందువల్లనో వచ్చింది కాదు. అది ఆయనకు తండ్రి సర్వేశ్వరునితో ఉన్న సన్నిహిత సంబంధం వల్ల, ముఖాముఖి సంభాషణ వల్ల వచ్చిన శక్తి. తండ్రి సర్వేశ్వరుని వక్షస్థలంలో వసించిన కుమారుడు గ్రహించగలిగిన శక్తి అది. నిరంతరం తండ్రితో ప్రార్థన ద్వారా జరిపిన సంభాషణ వల్ల పొందిన శక్తి అది.

**యేసు జీవితంలో ఓ రోజు:** యేసు బహిరంగ జీవితంలో మొదటి రోజు పనివత్తిడిని మన ముందుంచుతుంది నేటి సువార్తా పఠనం. ఆయన బహిరంగ జీవితంలోని ప్రధాన కార్యక్రమాలను ఈ పఠనం ప్రదర్శిస్తుంది. యేసు, బహిరంగ అర్చనలో పాల్గొనడం, బోధిం,డం, స్వస్థపరచడం, అపవిత్రాత్మను తరిమివేయడం, వ్యక్తిగతంగా ప్రార్థించడం అవి టూకీగా ఈరోజు ఆయన జీవితంలో జరిగిన కార్యక్రమాలు. అంతేకాకుండా ప్రజలు ఉత్సాహకరమైన స్పందనను గూడ తెలియజేస్తుంది పఠనం.

విశ్రాంతి దినాన కఫర్నామ ప్రార్థనా మందిరంలో యేసు జరిపిన కార్యక్రమాలను వివరిస్తుందీ పఠనం.

**ఆవేశింపబడిన వ్యక్తం:** యేసుక్రీస్తు అధికారయుతంగా మాట్లాడడమే కాదు, అధికారయుతంగా ప్రవర్తించారు కూడ. ఆయన మాట్లాడుతున్న సమయంలో ప్రార్థనా మందిరంలో ప్రజల మధ్య అపవిత్రాత్మ ఆవేశించిన ఓ వ్యక్తి ఉన్నాడు అని చెబుతుంది పఠనం. అంటేనేంటి? ఇక్కడ మనం ఓ విషయం గమనించాలి? యేసు కాలంలో ఆత్మలతో మంచి ఆత్మలు, కీడు కలిగించే ఆత్మలతో ప్రపంచం నిండి ఉందని ప్రజలు నమ్మేవాళ్ళు. అన్ని ఆత్మలు ఉన్నాయని అవి ప్రజలను ఆవేశించి బాధిస్తాయని నమ్మేవాళ్ళు. కొంత మంది ప్రజలు ఆ ఆత్మల సహాయంతో తమ శత్రువులను బాధించేవాళ్ళు అనికూడ నమ్మేవాళ్ళు.

అయితే ఈ నమ్మకం, ఆనాటి ప్రజల్లోనే కాదు ఈనాటి ప్రజల్లోను, మన సంఘాల్లోను ఉంది అంటే అతిశయోక్తి ఏమి కాదు. మన ఆంధ్రప్రదేశ్‌లోనేకాదు దక్షిణాసియా దేశాలైన మలేషియా, ఇండోనేషియా ఫిలిప్పిన్స్‌లో గూడ బలంగానే ఉంది. అంతేగాక ఈ ఆత్మల ప్రభావం ప్రపంచంలోని పలుదేశాల్లో సాంకేతికంగా, శాస్త్రీయంగా, వైజ్ఞానికంగా ప్రగతి సాధించిన దేశాల్లోగూడ ఈ నమ్మకం కనబడుతూనే ఉంది. చేతబడి చేశారన్న నమ్మకం, చాలా మందిని పీడిస్తుంది. మనం జరుపుకొనే శుభకార్యాలకు

మంచి ముహూర్తం చూయించుకొనే అలవాటు ఈ నమ్మకంలోని భాగమే. చేతబడిచేసి, ప్రజలను అపవిత్రాత్మలతో బాధిస్తున్నారన్న నెపంతో కొంతమంది ప్రత్యక్షంగా చంపిన ఉదంతాలు మన మధ్య జరక్కపోలేదు.

యేసుప్రభుకాలంలో ఏ వ్యక్తి అయినా జ్వరంతో బాధపడితే లేదా అసాధారణంగా ప్రవర్తిస్తే సదరు వ్యక్తిని అపవిత్రాత్మ ఆవహించిందని నమ్మేవాళ్ళు. మూర్ఛరోగులు, అపస్మారక స్థితిలో ఉన్నవాళ్ళు, దుస్సంకోచస్తులు, మానసిక రోగస్తులులాంటి వ్యక్తులు అపవిత్రాత్మల వల్ల పీడింపబడేవాళ్ళుగా పరిగణించే వాళ్ళు. ఆ పరిస్థితి వల్ల ఆయా వ్యక్తులు తమ మాట, చేతల్లో అదుపు అప్పుతారు. అంటే అపవిత్రాత్మ వశంలోకి వాళ్ళు వెళ్ళారని మిగతా ప్రజలు నమ్మేవాళ్ళు. ఈ అపవిత్రాత్మలు నిజంగా ఉన్నాయా? అని చాలా మంది ప్రశ్నిస్తుంటారు. దీనికి సమాధానం చెప్పడం సులభం కాదు. ఇటువంటి స్తితిలో నున్న వారు మందులతో స్వస్థత పొందుతున్న విషయం మనకు తెలుసు. మరి అలాంటప్పుడు మందులతో అపవిత్రాత్మలు పోతాయా? అయినా, అపవిత్రాత్మల ప్రభావం ఉన్నట్టు కొంతమంది అనుభవంలోకి వస్తుంది. అవి ఉన్నది, లేనిది, ఉంటే మనుషుల మీద వాటి ప్రబావం ఎంత ఉంటుంది అన్న విషయం యిద్దమిద్ధంగా తేల్చిచెప్పడం అంత సులభం కాదు.

అయితే నేటి సువార్తలో అసలు విషయం ఏంటంటే, అటువంటి వాళ్ళుగూడ స్వస్థతపొందారు. పరిపూర్ణతకు తిరిగి పునరుద్ధరింపపబడ్డారు. వారిని అలాంటి పరిపూర్ణస్థితికి తెచ్చిందెవరు? యేసుక్రీస్తు. ఆయన వారికి బాధల నుండి, పీడనల నుండి విముక్తి, స్వేచ్ఛను కలుగజేశారు.

**నేటి అపవిత్రాత్మలు:** అయితే ప్రస్తుత ప్రపంచంలో దుష్టశక్తులు ఉన్నాయన్న సత్యాన్ని విస్మరించలేం. కొన్ని బృందాలు లేదా కొందరు వ్యక్తులు, కొంత మంది ప్రజలను అమానుష బాధలకు గురిచేస్తున్న విషయాన్ని కాదనలేము. ఈ పరిస్థితులపట్ల మనం అనేకసార్లు అసహాయతను వ్యక్తం చేస్తాం. ఆ మాటకొస్తే మనం ఎదో రూపంలో ఈ పరిస్థితికి దోహదం చేస్తున్నాం అనే చెప్పాలి.

ఇక్కడ ముఖ్యమైన విషయం ఏంటంటే యేసుకాలంలోనే ప్రజలు, ఈ లోకంలో అన్ని రకాల శక్తులు వశిస్తున్నాయని నమ్మేవాళ్ళు. ఈ శక్తులు మానవుల్లో కొద్దోగొప్పో భయాన్ని కలిగిస్తూ వారిని అచేతనులుగా చేశేవని నమ్మారు. అట్టి పరిస్థితిలో యేసు చేసిందేమంటే అటువంటి వారి నుండి ఆ భయాన్ని పారద్రోలి వారిని బంధవిముక్తుల్ని చేశారు. దుష్టశక్తులు ఉన్నాయి, అన్న వారి నమ్మకం కంటే అవి తమను బాధిస్తున్నాయి అన్న భయమే వారికి ఎక్కువ. వాటి అస్తిత్వం, అవి జీవిస్తున్న వాస్తవం వారి మనసులో,

మదిలో తిష్ఠవేసుకొని వారి స్వేచ్ఛను హరించేస్తున్నాయి. క్రియా శూన్యుల్ని చేస్తున్నాయి అని వారు అధికంగా భయపడేవాళ్ళు. ఆ నమ్మకం వారిని క్రుంగదీసేది. ఈ నమ్మకం ఈ కాలంలో గూడ అనేక సంసక్కృతులకు చెందిన ప్రజల్లోను ఉంది. ఉదాహరణకు నీవు ఓ రబ్బరు పామును ఓ వ్యక్తి నిద్రిస్తున్న సమయంలో ఆయన పక్కన పెట్టావనుకో, ఆయనకు మెలుకవ వచ్చిన తరువాత దాన్ని చూసి భయంతో కెవ్వున కేకవేస్తాడు. అలా అతను కేకవేయడానికి కారణం రబ్బరు పామా? కాదు అందువల్ల కలిగిన భయమే కారణం. వాస్తవానికి అది పాముకాదు. అది పాము అన్న భయం, భ్రాంతి ఆయన్ను కేకవేయ పురికొల్పింది.

**భయంలేదు:** కఫర్నాము ప్రార్థనామందిరంలో యేసుచేసింది ఆ భయాన్ని పోగొట్టడమే. ఆ బాధితుడు అక్కడ చేరిన వారు భయపడ్డట్టుగా, యేసు ఆ బాధితుడిని చూసి ఆయన చేస్తున్న చేష్టలు చూసి ఆయన మాటలు విని భయపడలేదు. పైగా ధైర్యంతో, "నోరు మూసుకొని వీనినుండి వెడలి పొమ్ము" అని గద్దించారు. అప్పుడు అది వానిని విలవిలలాండించి, బిగ్గరగా అరచి వెళ్ళిపోయింది. అంటే దానినుండి బాధితుడు స్వేచ్ఛను పొందాడు. భయం నుండి బంధవిక్తుడయ్యాడు. ఈ వృత్తాంతంలో ముఖ్యమైన విషయం రోగి భయం కబంధహస్తాల నుండి విముక్తిత పొందడం.

మరి మన భయాలేంటి? మనల్ని పీడించే ఆత్మలేంటి? మనం చేయాలనుకొన్న పనుల్ని చేయనీయకుండా మనం మసలుకోవాలనుకొన్న విధంగా మసలుకోకుండా శక్తులు చేసేవేంటి? మనం ఉండాలనుకొన్న రీతిలో ఉండకుండ అడ్డుకొనే దుష్ఠశక్తులేంటి? ఈ శక్తులు మరెవరిలోనో, మన వెలుపలనో ఉన్నవి అని భ్రమించడం కంటే అవి మనలోనే, మన అంతరాళాల్లోనే ఉన్నాయని గ్రహించడం ముఖ్యం. మనలోని ఈ దుష్ట శక్తులను మనం గుర్తించినప్పుడు వాటిని పెలికించి వేయమని మనం యేసును అర్థించవచ్చు. అప్పుడు సర్వశక్తిమంతుడు, సర్వాధికారియైన క్రీస్తు, వాటి శక్తి నుండి వాటి భయం నుండి మనల్ని విముక్తుల్ని చేస్తారు.

ఆ ప్రార్థనా మందిరంలోని ప్రజలు యేసు అధికారయుత బోధనకు, ఆయన చేతల్లోని శక్తికి అబ్బురపడ్డారు. "ఇది యేమి? ఈ నూతన బోధయేమి? అధికారముతో ఆజ్ఞాపించగా అపవిత్రాత్మలు సహితము ఆయనకు లోబడుచున్నవి" అని అవాక్కయ్యారు. అందుకే ఆయన కీర్తి ప్రతిష్టలు ఆ ప్రాంతమంతటా వ్యాపించాయి అనడంలో ఆతిశయోక్తి ఏమి లేదు.

**సర్వాధికారి క్రీస్తు:** యేసుక్రీస్తు తన బహిరంగ జీవితం ఆరంభించిన రోజున ఆయన ప్రదర్శించిన ప్రతిభను శక్తిని ఇక్కడ సువార్తీకుడైన మార్కు కడు రమ్యంగా చిత్రించిన

విధానం మనం గమనిస్తున్నాం. యేసుక్రీస్తు రక్షణ కార్యం మొదలయింది. యేసు అలా అధికారం ప్రదర్శించడంతో దైవరాజ్యం సమీపించిన ఆనవాళ్ళు కనుపించాయి. ఆయన శక్తిని ప్రజలు అనుభవించారు. అట్టి శక్తి ఎటువంటిదో మనం పరిశీలించాల్సి యుంది.

ఆయన శక్తి, అధికారంతో కూడుకొన్నటువంటిది. ఆ అధికారం ఇతరులను భయపెట్టి వారిని తన స్వార్ధంకోసం వినియోగించుకొనునట్టిది కాదు. ఆయన అధికారం ఇతరుల భయాన్ని పోగొట్టి వారికి అభయహస్తం చాచే అధికారం. ఇతరులను శక్తిమంతుల్ని చేసేది. తమలోని భ్రాంతి, భయాలను పోగొట్టుకొనేలా చేసేది. తమ అసహాయతను అచేతనాన్ని అధిగమించేలా చేసేది ఆయన అధికారం. పూర్తి మానవులుగా, ప్రతిభావంతులుగా ఎదగడానికి నిద్రాణమైయున్న తమలోని శక్తియుక్తుల్ని మేలుకొలిపేది యేసు అధికారం.

**అధికారము సేవ:** ఇటువంటి అధికారం చెలాయించడానికే ఆయన ఈలోకానికి వచ్చారు. ప్రజలను పరిపాలించడానికి, వారిపై ఇనుపకాలిని మోపడానికి, వారిని తన అదుపాజ్ఞల్లో ఉంచుకోడానికి యేసు ఈ లోకానికి రాలేదు. ఓసారి యేసు చెప్పినట్టుగా, తను సేవచేయడానికే వచ్చారు. కాని సేవ చేయించుకోడానకి కాదు. మానవుల్ని అన్ని రకాల  భంధవిముక్తుల్ని చేయడానికే ఆయన వచ్చారు. తద్వారా ప్రజలు ఉత్పాదక సాధకతను పెంపొందించుకొని తమ శక్తియుక్తుల్ని ఉపయోగించుకొని పూర్తి చైతన్యంతో దేవుని జీవంతో జీవించాలని ప్రభువు ఆశించారు.

అపవిత్రాత్మల భయం, బంధం, స్వార్ధం, సంకుచితత్వం, ఆగ్రహం, ద్వేషం, శతృత్వం, హింసా ప్రవృత్తి నుండి స్వేచ్ఛను కలిగించడమే క్రీస్తు ప్రభు రాకడ ధ్యేయం. ఈ శక్తుల నుండి మానవాళిని విముక్తుల్ని చేసి సమృద్ధిగా జీవించేలా చేయడమే ఆయన అభిమతం. ఆ విషయాన్నే ప్రభు చెప్పారు. “నేను జీవమునిచ్చుటకును, దానిని సమృద్ధిగా నిచ్చుటకును వచ్చియున్నాను”. (యోహాను 10:10).

ఆ సమృద్ధియైన జీవాన్ని మనం పొందేటట్టు ఆ ప్రభుయేసును ప్రార్థించుకొందాం. సేవాపూర్ణమైన సమృద్ధియైన జీవం ప్రసాదించే యేసు అధికారాన్ని మనచుట్టు ప్రక్క ప్రజలు గూడ తెలుగుకొనే భాగ్యం పొందేటట్టు, క్రమక్రమంగా ఆ ప్రభుయేసు మహిమను లోకమంతా తెలుసుకొని ఆనందించే భాగ్యం కలగాలని ఆ ప్రేమమయుని మనసారా ప్రార్థించుకొందాం. ఆమెన్.

# సమాచారములు

## బైబిలు పరీక్ష:

ది. 22-1-2018న ఉపదేశులకు **"యోహాను సువార్త"** మరియు **"అపోస్తుల కార్యములు"** నందు పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. సమయం ఉదయం 10 గం॥లకు పాస్టరల్ సెంటరు నందు పరీక్ష నిర్వహించబడును.

## ఉపదేశులతో సెమి క్రిస్మస్ వేడుకలు:

సమస్త ప్రజలకు పరమానందం కలిగించే లోక రక్షకుడైన క్రీస్తు జననాన్ని నిరీక్షిస్తూ సంతోషం నిండిన హృదయాలతో ది. 18 డిశంబరు 2017న మేత్రాసన పాస్టరల్ సెంటర్ ఉపదేశులతో కలసి సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంది. ఉదయం 11.00 గం॥లకు ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ వేడుకలు సా॥ 4.00 గం॥లకు ముగిశాయి. **రెవ.ఫా. బావన విజయ రాజుగారు** (తేలప్రోలు విచారణ కర్తలు) ఉదయం 11.30 గం॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ వరకు ఉపదేశులను ప్రార్థనలో నడిపించారు. బప్తిస్మ యోహానువలే అందరు (ఉపదేశులు) క్రీస్తు రాకడ కోసం విశ్వాసులను సిద్ధపరచాలని ఉపదేశించారు. మధ్యాహ్నం 2.00 గం॥ల నుండి సెమిక్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. **రెవ.మోన్సిగ్నోర్ మేశపం గాబ్రియేలు** గారు (వికార్ జనరల్) ముఖ్య అతిథిగా, **రెవ.ఫా. యేలేటి విలియం జయరాజు** గారు (గుణదలమాత పుణ్యక్షేత్ర రెక్టరు), **రెవ.ఫా. మోచర్ల అరవింద్ గారు** (దివ్యవాణి కోఆర్డినేటర్) గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. వీరందరూ క్రిస్మస్ సందేశాలను అందించి ఉపదేశులకు సువార్త పరిచర్యలో స్ఫూర్తిని ఇచ్చారు. డాన్‌బోస్కో నోవిషియేట్ నుండి బ్రదరుగార్లు, విజయమేరి హైస్కూలు నుండి బాలబాలికలు క్రిస్మస్ గీతాలకు చక్కని నృత్యంచేసి అలరించారు. **రెవ.ఫా. బంటుమిల్లి యోహాను** గారి (గుడ్‌మాన్ పేట విచారణ కర్తలు) సంగీత నిర్వహణలో ఉపదేశులు చక్కని క్రిస్మస్ గీతాలను ఆలపించారు. క్రిస్మస్ కేక్ కటింగ్‌తో వేడుకలు ముగిశాయి. సహకరించిన విచారణ గురువులకు జ్యోతిర్మయి కో-ఆర్డినేటర్ శ్రీ.వై. జోజిబాబు గారికి, సిస్టర్.ఫాతిమా గారికి, పాస్టరల్ సెంటర్ బృందానికి ధన్యవాదాలు.

## యువతీ యువకులతో సెమిక్రిస్మస్ వేడుకలు:

పాస్టరల్ సెంటర్ ఆద్వర్యంలో ది.21 డిశంబరు 2017న యువతీయువకులతో కలసి ప్రేరణయూత్ సెంటర్ నందు సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉ॥ 11.00 గం॥ల నుండి ప్రార్ధనా సమావేశం ఏర్పాటు చేయబడింది. రెవ.ఫా. పెయ్యల అంతోనిగారు “శ్రీసభలో యువతీయువకుల భాగస్వామ్యం - సహకారం గురించి చక్కగా ఉపదేశించారు. అనంతరం కేరల్‌డాన్స్ పోటీలు నిర్వహించడం జరిగింది. రెవ.ఫా. రవీంద్ర గారు (కళాదర్శిని డైరెక్టర్) న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. యువతీయువకుల సామర్థ్యాన్ని చూసి వారిని కళాదర్శినిలో నిర్వహించే కార్యక్రమాలలో నటించడానికి ఆహ్వానించారు. అనంతరం మొదటి బహుమతిగా రూ. 2000/-, రెండవ బహుమతిగా రూ. 1500/-, మూడవ బహుమతిగా రూ. 1000/- డాన్స్ పోటీలలో గెలుపొందిన వారికి ఇవ్వడం జరిగింది. క్రిస్మస్ కేక్ కటింగ్‌తో వేడుకలు ముగిశాయి. సహకరించిన మేత్రాసన యూత్ ప్రెసిడెంట్ శ్రీ. యమ్ సునీల్ గారికి ధన్యవాదాలు.

## గుణదలమాత తిరునాళ్ళు - ఉపదేశుల సహకారం

ప్రతిసంవత్సరం మాదిరిగానే, ఈ సంవత్సరం కూడా గుణదలమాత ఉత్సవాలకు ఉపదేశుల సహాయం, సహకారం అవసరం. కావున, విచారణ గురువులు తమ తర్ఫీదు పొందిన ఉపదేశులను మాత్రమే పంపవలసిందిగా విజ్ఞప్తి. వారు ది. 8 ఫిబ్రవరి 2018న సాయంత్రం 4.00 గం॥లకు బిషప్ గ్రాసి స్కూలుకు చేరవలెను. మూడు రోజుల ఉత్సవాల అనంతరం వారికి పారితోషకం ఇవ్వబడుతుంది.

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| జి. జోజి | వెంట్రప్రగడ | 01-01-1967 | 9652232463 |
| యమ్. యాకోబు | కోరుకొల్లు | 01-01-1963 | 8179113276 |
| పి. రవి | చల్లపల్లి | 01-01-1973 | 9959779885 |
| యు. జకరియా | కంకిపాడు | 01-01-1969 | 9247783299 |
| జి. చార్లెస్ మెర్లో | జగ్గయ్యపేట | 01-01-1962 | 9618339281 |
| ఆర్. జయరాజు | రాణిగారి తోట | 01-01-1971 | 9963938479 |
| యన్. ఆదాము | చిల్లకల్లు | 01-01-1966 | 9553159072 |
| వి. యోహాను | రమణక్కపేట | 01-01-1976 | 9676421096 |
| కె. జయరాజు | రమణక్కపేట | 01-01-1981 | 9502073403 |
| కె. దేవదానం | విసన్నపేట | 01-01-1974 | 8790899104 |
| యమ్. లోకేష్ | విసన్నపేట | 01-01-1974 | 9010628960 |
| యు. జాషువా | కోలుపాడు | 01-01-1983 | 8464947415 |
| బి. దావీదు | పెనుగొలను | 01-01-1959 | 9705575519 |
| జి. డేవిడ్ | కంకిపాడు | 02-01-1949 | 9292451361 |
| సిహెచ్.వరరత్న సుందర్ | గుడ్‌మన్‌పేట | 02-01-1965 | 9490514293 |
| యమ్. సాయి మేరి | నున్న | 03-01-1984 | 9948056252 |
| యమ్. యేసు రత్నం | ఆరుగొలను | 03-01-1947 | 9676501845 |
| జి. సామ్యుయేల్ | చిల్లకల్లు | 04-01-1974 | 9951621665 |
| జి. సామ్యుయేల్ | కైకలేరు | 04-01-1978 | 9963285606 |
| జి. చంద్రశేకర్ బాబు | ఆగిరిపల్లి | 05-01-1975 | 9490303409 |
| డి. జయరాజు | ముసునూరు | 05-01-1968 | 9542121868 |
| టి. యోహాను | చాట్రాయి | 05-01-1978 | 9705424316 |
| వై. జయప్రకాష్ | వత్సవాయి | 11-01-1949 | 9849294271 |
| సి.హెచ్. స్వామిదాసు | ముసునూరు | 10-01-1972 | 9449503090 |
| జి. తంబీ | గుడ్‌మన్‌పేట | 13-01-1989 | 8897732714 |
| టి. దేవదాసు | రమణక్కపేట | 15-01-1971 | 9908994211 |
| యన్. ఏలీషా | జగ్గయ్యపేట | 15-01-1973 | 9949729017 |
| యస్. బాలస్వామి | తేలప్రోలు | 16-01-1963 | 9052349094 |
| డి. జయరాజు | మంగినపూడి | 18-01-1967 | 9908352746 |
| యమ్. ఆంద్రేయా | గుడ్లవల్లేరు | 19-01-1965 | ---------- |
| యమ్. మిఖాయేలు | రమణక్కపేట | 19-01-1967 | 8985451374 |
| పి. భూషణం | కలిదిండి | 20-01-1966 | 9949762937 |
| వి. జ్ఞానప్రకాష్ రావు | గుడివాడ - 1 | 24-01-1963 | 9293050070 |
| టి. జోసఫ్ మాత్యూ | అవినిగడ్డ | 25-01-1977 | 7306593226 |
| కె. జ్ఞానసుందర రావు | శారాదానగర్ | 25-01-1984 | 9440654384 |
| కె. లాజరు | కూచిపూడి | 26-01-1951 | ---------- |
| బి. అనీల్ కుమార్ | సింగినగర్ | 28-01-1983 | 9912204846 |